PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 57, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 17 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## కీలక వాణిజ్య చర్చలకు ముందు, అమెరికా ప్రతినిధితో భారత రాయబారి భేటీ



- ఇండియా హౌస్‌లో జేమీసన్ గ్రీర్‌తో వినయ్ మోహన్ క్వాత్రా సమావేశం
- సమావేశంలో పాల్గొన్న అమెరికా జాతీయ భద్రతా మాజీ సలహాదారు
- ట్రేడ్ డీల్ కోసం వచ్చే వారం అమెరికా వెళ్లనున్న భారత బృందం

2లో



2లో

## డీలిమిటేషన్ లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలి

- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం సరికాదు
- తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత

హైదరాబాద్: తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు


# నారీశక్తి అనేది నినాదం కాదు మన నాగరికతకు బలం

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- ★ మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్
- ★ మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- ★ వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్
- ★ రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని



అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన ‘నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు‘ ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో మిగతా.. 2లో



## రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం

తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన మిగతా.. 2లో

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

### లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి



ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం మిగతా.. 2లో



2లో

## తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం

- తిరుమల కొండపై ఓ మోస్తరు రద్దీ
- భక్తులతో నిండిన 18 కంపార్ట్‌మెంట్లు
- శ్రీవారిని దర్శించుకున్న 77,077 మంది భక్తులు
- హుండీ ద్వారా రూ.3.47 కోట్ల ఆదాయం



2లో

## ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రధాని మోదీ పిలుపు

- అంతర్జాతీయ సంస్థలకు ప్రధాని మోదీ సూచన
- పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలన్న మోదీ
- ఆస్ట్రియా ఛాన్సెలర్‌తో కలిసి ప్రెస్ మీట్‌లో పాల్గొన్న మోదీ

## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ..

### అమిత్ షా, అఖిలేశ్ ల మధ్య మాటల యుద్ధం

- ‘ఉప-కోటా ’ కోసం అఖిలేశ్ డిమాండ్.. కుదరదని తేల్చిచెప్పిన అమిత్ షా
- ఓబీసీ, ముస్లిం మహిళలకు సబ్-కోటా ఇవ్వాలని అఖిలేశ్ డిమాండ్
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు మిగతా.. 2లో



# మండుతున్న ఎండలు..

## తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ★ ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండ ప్రచండమే... వడగాలులతో జాగ్రత్త..
- ★ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 నుంచి 4.5 డిగ్రీలు పెరిగే అవకాశం
- ★ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మంలో మరో వారంపాటు జాగ్రత్తగా ఉండాలి
- ★ వృద్ధులు, వ్యవసాయ, శానిటరీ, నిర్మాణ రంగ కార్మికులూ అప్రమత్తంగా ఉండాలి
- ★ చలివేంద్రాలను ప్రోత్సహించండి... పీహెచ్‌సీల్లో ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచండి
- ★ జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపిన విపత్తుల నిర్వహణ శాఖ




హైదరాబాద్: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఈ వేసవి గతం కంటే భిన్నంగా ఉండే అవకాశం ఉందని, భారీ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగొచ్చని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లను కోరింది. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, మిగతా.. 2లో




## కాకినాడ సెజ్‌కు మరో భారీ పరిశ్రమ.. రూ.700 కోట్ల పెట్టుబడితో ప్లాంట్

- రూ.700 కోట్ల పెట్టుబడితో చెన్నై చెన్నైకి చెందిన గ్రీన్ కోక్ ఎనర్జీ ప్లాంట్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 2000 మందికి ఉపాధి అవకాశం
- స్టీల్ ఉత్పత్తిలో వాడే మెటలర్జికల్ కోక్‌ను తయారు చేయనున్న కంపెనీ

2లో

అమరావతి: ఏపీలో పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి.



## రాష్ట్రానికి కంపెనీలు వస్తుంటే తరిమేస్తామనడం రాక్షస మనస్తత్వం

- ఇదేం రాక్షస మనస్తత్వం?: జగన్‌పై మంత్రి లోకేశ్ ఫైర్
- వైసీపీ, జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు
- మత్స్యకారుల పిల్లలకు వెయ్యికి పైగా ఉద్యోగాలు వస్తుంటే అడ్డుకుంటారా అని ప్రశ్న
- తల్లిని, చెల్లిని గెంటేశారంటూ పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రతిపక్ష వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మిగతా.. 2లో

## ఆధిపత్యం కోసం చూస్తే క్షిపణితో దాడి చేస్తాం


### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



2లో

- హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నిస్తోందన్న ఇరాన్
- మేం క్షిపణి దాడి చేస్తే అమెరికా నౌకలు ధ్వంసమవుతాయని హెచ్చరిక
- మేం దాడి చేస్తే అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని వ్యాఖ్య

## అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా.. సాయం చేసిన చైనా శాటిలైట్!



2లో

- గతేడాది రహస్యంగా శాటిలైట్‌ను సమకూర్చుకున్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్
- సౌదీ, జోర్డాన్, ఇరాక్‌లోని యూఎస్ బేస్‌ల కదలికలను ట్రాక్ చేసిన వైనం
- చైనా ప్రభుత్వ అనుమతితోనే ఇది జరిగిందంటున్న నిపుణులు

## కీలక వాణిజ్య చర్చలకు ముందు, అమెరికా ప్రతినిధితో భారత రాయబారి భేటీ

ఢిల్లీ: అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా వాషింగ్టన్‌లో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్, జాతీయ భద్రతా మాజీ సలహాదారు రాబర్ట్ ఓ'బ్రియన్‌లతో భేటీ అయ్యారు. భారత్, అమెరికా మధ్య మరోసారి వాణిజ్య చర్చలు జరగనున్న తరుణంలో, ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు భారత అధికారుల బృందం అమెరికాను సందర్శించనుంది. ఈ క్రమంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశంపై జేమీసన్ గ్రీర్, వినయ్ మోహన్ క్వాత్రా చర్చించారు. "ఈరోజు ఇండియా హౌస్‌లో అంబాసిడర్ జేమీసన్ గ్రీర్, అంబాసిడర్ రాబర్ట్ ఓ'బ్రియన్‌లకు ఆతిథ్యం ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాం" అని వినయ్ మోహన్ క్వాత్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ద్వైపాక్షిక సహకారంపై ఇరుదేశాలకు ఉన్న అవకాశాలపై చర్చించినట్లు తెలిపారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కీలక పరిణామాలపై చర్చించామని వెల్లడించారు. వాణిజ్య చర్చల కోసం భారత బృందం వచ్చేవారం వాషింగ్టన్ వెళ్లనుంది. భారత్, అమెరికా ప్రతినిధులు ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు వాషింగ్టన్‌లో చర్చలు జరపనున్నారు.

## ఆధిపత్యం కోసం చూస్తే క్షిపణితో దాడి చేస్తాం

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

ఢిల్లీ: హర్మూజ్ జలసంధితో పాటు ఇరాన్ నౌకాశ్రయాల వద్ద పెద్ద ఎత్తున సైనికులను మోహరించిన అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరిక చేసింది. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తే తమ తొలి క్షిపణికే ఆ దేశానికి చెందిన నౌకలు మునిగిపోతాయని హెచ్చరించింది. ఇరాన్‌కు వెళ్లే, ఇరాన్ నుంచి వెలుపలకు వచ్చే నౌకలను అడ్డుకుంటున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారు మెహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. హర్మూజ్‌కు ట్రంప్ రక్షణంగా ఉండాలనుకుంటున్నారని, కానీ అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పని ఇదేనా? అని ప్రశ్నించారు. జలసంధిపై ఆధిపత్యం చేయాలని చూస్తే ఇరాన్ తొలి క్షిపణి దాడి అమెరికా పైకే ఉంటుందని అన్నారు. మా క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి మీ నౌకలను ధ్వంసం చేయగలవని హెచ్చరించారు. తాము దాడి చేస్తే ఆ ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని వ్యాఖ్యానించారు.

### అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా..

## సాయం చేసిన చైనా శాటిలైట్!

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఇటీవల ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో అమెరికా సైనిక స్థావరాలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ చైనా తయారీ శాటిలైట్‌ను ఉపయోగించుకుందని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ పరిణామం గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, గతేడాది ఇరాన్ రహస్యంగా పొందిన ఈ శాటిలైట్ పేరు ౹జుజు-01దీ. దీనిని చైనాకు చెందిన 'ఎర్త్ ఐ కంపెనీ' అభివృద్ధి చేసి ప్రయోగించింది. అనంతరం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ విభాగానికి దీనిని అప్పగించారు. కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాతే విదేశీ కొనుగోలుదారులకు ఉపగ్రహాలను బదిలీ చేసే 'ఇన్-ఆర్బిట్ డెలివరీ' అనే పద్ధతిలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బీజింగ్‌కు చెందిన ఎంపోశాట్ అనే మరో సంస్థకు చెందిన కమర్షియల్ గ్రౌండ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను కూడా ఇరాన్ వినియోగించుకునేందుకు అనుమతి లభించింది. ఈ శాటిలైట్‌ను ఉపయోగించి పశ్చిమాసియాలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ నిఘా పెట్టింది. మార్చి 13, 14, 15 తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ చిత్రాలను ఈ శాటిలైట్ బంధించింది. అదే సమయంలో జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్‌లోని ఎర్బిల్ ఎయిర్‌పోర్ట్ వద్ద కార్యకలాపాలను కూడా ట్రాక్ చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. కువైట్‌లోని క్యాంప్ బ్యూహ్రింగ్, అలీ అల్ సేలం ఎయిర్ బేస్ వంటి అమెరికా సంబంధిత స్థావరాలు కూడా దీని నిఘా నీడలోనే ఉన్నాయి. "చైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ చైనా కంపెనీ ఇలాంటి ఉపగ్రహాన్ని ప్రయోగించడం అసాధ్యం. చైనా చాలా కాలంగా ఇరాన్‌కు నిఘా సమాచారంతో సాయం చేస్తోంది, అయితే ప్రభుత్వ ప్రమేయం బయటపడకుండా జాగ్రత్త పడుతోంది" అని పాశ్చాత్య దేశాలకు చెందిన ఓ మాజీ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి వ్యాఖ్యానించారు. అయితే, ఇరాన్‌కు ఎలాంటి సైనిక మద్దతు ఇవ్వడం లేదని చైనా విదేశాంగ శాఖ గత కొన్ని రోజులుగా ఖండిస్తూ వస్తోంది. చైనా చాలా కాలంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి మద్దతు ఇస్తోందని, క్షిపణుల తయారీకి ఉపయోగపడే ద్వంద్వ వినియోగ పారిశ్రామిక భాగాలను అందిస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా-ఇరాన్ బంధంపై గల్ఫ్ దేశాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి

ఢిల్లీ: అంతర్జాతీయ సంస్థలు ప్రపంచశాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధం ప్రభావం ప్రజల జీవన విధానంపై పడుతోందని అన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా ఏదైనా సమస్య శాశ్వతంగా పరిష్కారమై, శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కోవడానికి సరికొత్త సంస్కరణలు చేపట్టవలసి ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను తుదముట్టించడం కూడా అవసరమని అన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్‌లో వాణిజ్య పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని అన్నారు. భారత్-ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

## తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం

తిరుపతి: తిరుమల శ్రీవారి సన్నిధిలో భక్తుల రద్దీ ఓ మోస్తరుగా కొనసాగుతోంది. టైమ్ స్లాట్ సర్వదర్శనం (ఎస్ఎస్ డీ) టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 8 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నాటికి, తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 18 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండి ఉన్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. (ఏప్రిల్ 15) ఒక్కరోజే 77,077 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. 27,241 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.47 కోట్ల ఆదాయం లభించింది.

## డీలిమిటేషన్ లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలి

హైదరాబాద్: తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ఆమె తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో భాగంగా తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణకు ఉన్న 3.13 శాతం ప్రాతినిధ్యాన్ని బేస్‌లైన్‌గా పరిగణించాలని, పునర్విభజన తర్వాత కూడా ఈ శాతం తగ్గకుండా చూడాలని కవిత డిమాండ్ చేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినప్పటికీ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రాతినిధ్యం తగ్గితే అది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత అసహనం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును ఓబీసీ రిజర్వేషన్లతో ముడిపెట్టాలని, 33 శాతం కోటాలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తే వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు.

## రాష్ట్రానికి కంపెనీలు వస్తుంటే తరిమేస్తామనడం రాక్షస మనస్తత్వం

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రతిపక్ష వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశిస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రానికి మంచి చేసే కంపెనీలు వస్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమని, ఇది సైకోయిజం తప్ప మరొకటి కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. దేశ రక్షణకు ఉపయోగపడే అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తుంటే స్వాగతించాల్సింది పోయి, తరిమేస్తామనడం ఎలాంటి మనస్తత్వమని లోకేశ్ ప్రశ్నించారు. ఈ కంపెనీ ద్వారా మత్స్యకారుల పిల్లలకు వెయ్యికి పైగా ఉద్యోగాలు వస్తాయంటే ఆనందించకుండా అడ్డుకుంటాననడం రాక్షస మనస్తత్వమే అవుతుందని అన్నారు. ఇదే క్రమంలో ఆయన జగన్‌పై పరోక్షంగా వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. "తల్లిని తరిమేశారు, చెల్లిని గెంటేశారు. దైవం అంటే భక్తి లేదు. దేశం అంటే ద్వేషం. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసంతో రప్పా రప్పా నరుకుతాం, అమరావతిని మార్చేస్తాం, కట్టినవన్నీ కూల్చేస్తాం, కంపెనీలన్నీ వెళ్లగొడతాం.. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్ మోహన్ రెడ్డి గారూ!" అని తన పోస్టులో లోకేశ్ నిలదీశారు. ప్రతిపక్షం తీరును ఆయన 'సైకోయిజం'గా అభివర్ణించారు.

# మండుతున్న ఎండలు..

మొదటి పేజి తరువాయి

ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, వేడిగాలులు అధికమవుతాయని ఈ సర్క్యులర్‌లో హెచ్చరించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో మరో వారంపాటు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ వేసవిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 4144 డిగ్రీల వరకు నమోదవుతాయని, సాధారణం కంటే 1.5 నుంచి 4.5 డిగ్రీలు పెరిగే అవకాశముందన్నారు. రాత్రుళ్లు కూడా వేడి తగ్గకపోవచ్చని, అందువల్ల వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, వ్యవసాయ, నిర్మాణ, శానిటరీ, రవాణా రంగాల కార్మికులు, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలు, వన్యప్రాణులు, పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించారు.

ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, మాల్స్, బస్టాండులు, పబ్లిక్ భవనాల్లో కూలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయించాలని, ఎన్జీవోలు ఇతర సంస్థల ద్వారా చలివేంద్రాలను ప్రోత్సహించి వాటిలో మంచినీటితోపాటు మజ్జిగ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని చెప్పారు. ఎండలు, వేడి గురించి ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరిచేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా స్థాయి నోడల్ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, రోజూ జిల్లాల వారీ పరిస్థితులపై తమకు నివేదికలు పంపాలని పేర్కొన్నారు.

వడదెబ్బ బాధితులకు చికిత్స: మంత్రి రాజనర్సింహ

' రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందేలా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో




ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వేసవి పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఆసుపత్రుల్లో అవుట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు, వారి సహాయకులకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ జాగ్రత్తలు ముఖ్యం..

' ప్రజలు ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లకుండా ఉండాలని, తరచూ నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలన్నారు. తేలికపాటి దుస్తులు ధరించడం, తలకు కవర్ ఉపయోగించడం ద్వారా ఎండ తీవ్రతను తగ్గించుకోవచ్చని సూచించారు. వడదెబ్బ లక్షణాలపై కూడా వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం, తల తిరగడం, వాంతులు, మూర్ఛ, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది.

మండుతున్న ఎండలు.. తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఎండాకాలంలో అప్రమత్తంగా.. ఈ జాగ్రత్తలు పాటించండి

మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది.

### నారీశక్తి అనేది నినాదం కాదు

## మన నాగరికతకు బలం

మొదటి పేజి తరువాయి

పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. "మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం

తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

కులాల వారీగా ప్రధాన వర్గాలు

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి. ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.

ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### మహిళా బిల్లుతో దేశ రాజకీయాల

## దిశ, దశ మారతాయి

మొదటి పేజి తరువాయి

దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ..

మహిళల కు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప-కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరపున ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

## కాకినాడ సెజ్‌కు మరో భారీ పరిశ్రమ.. రూ.700 కోట్ల పెట్టుబడితో ప్లాంట్

అమరావతి: ఏపీలో పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొత్త పరిశ్రమలను నెలకొల్పే దిశగా చేపడుతున్న చర్యలు ఫలిస్తున్నాయి. తాజాగా కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) పరిధిలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. చెన్నైకి చెందిన గ్రీన్ కోక్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.700 కోట్ల పెట్టుబడితో ఇక్కడ పరిశ్రమను స్థాపించనుంది. ఈ మేరకు గ్రీన్ కోక్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, కాకినాడ సెజ్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. గ్రీన్ కోక్ ఎనర్జీ ఎండీ నటరాజన్, సెజ్ ఎండీ, సీఈవో రామ్‌రెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ పరిశ్రమ ద్వారా స్టీల్ ఉత్పత్తిలో కీలకమైన మెటలర్జికల్ కోక్‌ను తయారు చేస్తారు. కాకినాడ సెజ్‌లోని ఏవీ నగరం సమీపంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో దాదాపు వెయ్యి మందికి ప్రత్యక్షంగా, మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తద్వారా కాకినాడ జిల్లాలోని తొండంగి, ఉప్పాడ మండలాల పరిధిలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఇటీవలే అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడం దీనికి నిదర్శనం. ఇప్పుడు కాకినాడ సెజ్‌లో మరో కీలక పరిశ్రమ రావడం పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తోంది. ఇప్పటికే కాకినాడ సెజ్‌లో అరబిందో ఫార్మాకు చెందిన లైఫియస్, క్యూలే, పోర్టు పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రూ.2,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన లైఫియస్ ఫార్మా పరిశ్రమ ప్రారంభమైంది. ఇప్పుడు గ్రీన్ కోక్ ఎనర్జీ రాకతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుంది. సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తూ, మరిన్ని కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరలోనే మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## పిఠాపురానికి 'సెలక్షన్ గ్రేడ్' హోదా..

### పవన్ చొరవతో కీలక నిర్ణయం

అమరావతి: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ హోదా పెంపుతో పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం కానుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపినట్లు తెలుస్తోంది. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్, ప్రత్యేక అధికారి పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. 2021 నుంచి 2025 వరకు మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాల రికార్డులను సమీక్షించిన అనంతరం, సెలక్షన్ గ్రేడ్‌కు అర్హత ఉందని నిర్ధారించి ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా రూ.8 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ఉన్న మున్సిపాలిటీలకు సెలక్షన్ గ్రేడ్ హోదా కల్పిస్తారు. ఈ హోదా పెంపుతో పిఠాపురం అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ఇకపై గ్రూప్-1 స్థాయి అధికారి కమిషనర్‌గా బాధ్యతలు చేపడతారు. మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు భారీగా అందనున్నాయి. తద్వారా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. 1957లో మున్సిపాలిటీగా ఏర్పడిన పిఠాపురం, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పాదగయ క్షేత్రం, కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా దేవి శక్తిపీఠం, శ్రీపాద వల్లభుల ఆలయాలకు దేశవ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. పెరిగిన జనాభా, భక్తుల రద్దీతో మున్సిపాలిటీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఇటీవల కాలంలో పిఠాపురం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే 'పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' (పీఏడీఏ)ని ఏర్పాటు చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ.37.25 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇప్పుడు మున్సిపాలిటీ హోదా పెంపుతో అభివృద్ధి మరింత ఊపందుకోనుంది.

### డీలిమిటేషన్ తో నష్టం ఉండదు...

## మీకు బ్లాంక్ చెక్ ఇస్తున్నా: లోక్ సభలో ప్రధాని మోదీ

ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ఎలాంటి వివక్షకు, అన్యాయానికి తావుండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాను "గ్యారెంటీ", "ప్రామిస్" వంటి పదాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నానని, ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. "ఈ బిల్లు ఘనతను మీరే తీసుకోండి. మీకు నచ్చిన వారి ఫొటోలతో నేను ప్రకటనలు ఇవ్వడానికైనా సిద్ధం. ఈ విషయంలో మీకు 'బ్లాంక్ చెక్' ఇస్తున్నా" అని విపక్షాలను ఉద్దేశించి అన్నారు. ఈ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చే శక్తిమంతమైనదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. 2023లోనే 'నారీ శక్తి వందన్ అధినియం'ను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. "2029 నాటికి మహిళా కోటాను అమలు చేయడంలో విఫలమైతే, మన చిత్తశుద్ధిని మహిళలు నమ్మరు. దశాబ్దాలుగా వారికి నిరాకరించిన హక్కులను అందించే గొప్ప అవకాశం ఇప్పుడు మనకు లభించింది" అని మోదీ అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి పట్టణ స్థానిక సంస్థల వరకు ఇప్పటికే వేల సంఖ్యలో మహిళలు నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఇప్పుడు వారిని జాతీయ స్థాయిలో విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయాల్సిన సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు. అంతకుముందు, ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ ఆమోదించింది. విపక్షాలు రికార్డెడ్ ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో, డివిజన్ ప్రక్రియ ద్వారా దీనికి ఆమోదం లభించింది.

## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

ఢిల్లీ: డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినుల సత్తా చాటారు..

**అభినందించిన ప్రిన్సిపాల్ జి.కవిత**

**ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఆర్.షర్మిల 982 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది మొదటి సంవత్సరం పరీక్షల్లో పి.శిరీష 496 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.**



(నేటి శుభోదయ):పల్నాడు జిల్లా మాచర్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విశేష ప్రతిభకనబరిచి మరోసారి తమ సత్తా చాటారని ప్రిన్సిపాల్ జి.కవిత పేర్కొన్నారుగ్రామీణ ప్రాంతానికి చెందిన ఈ విద్యార్థినులు కష్టపడి చదివి అద్భుత ఫలితాలు సాధించడం అభినందనీయమైందని ప్రిన్సిపాల్ జి.కవిత తెలిపారు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చదువుతున్న మొత్తం 29 మంది విద్యార్థినుల్లో 29 మంది ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని 100% పర్సంటేజ్ వచ్చిందని ప్రిన్సిపాల్ జి.కవిత తెలిపారు అలాగే మొదటి సంవత్సరంలో కూడా అధిక శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు అందించారు.ఈ ఫలితాలు పాఠశాలలో ఉన్న విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నాయి. వ్యక్తిగత ప్రతిభ విషయానికి వస్తే, మొదటి సంవత్సరం పరీక్షల్లో పి.శిరీష 500 మార్కులకు గాను 496 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఆర్.షర్మిల 1000 మార్కులకు గాను 982 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. వారి కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ విజయంపై మాచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.కవిత ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని మాచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.కవిత ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కేజీబీవీ పాఠశాలలు విద్యార్థినుల భవిష్యత్తును నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ ఫలితాలు మరోసారి రుజువు చేస్తున్నాయ మాచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.కవిత పేర్కొన్నారు భవిష్యత్తులో మరింత ఉత్తమంగా రాణించాలని మాచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.కవిత ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది బి. కరుణ, ఎల్. రోహిణి, ఏ. పూర్ణిమ, ఎన్. చందన పాల్గొని విద్యార్థినిలకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు

## గిరిజనుల అభ్యున్నతి ప్రతి ఒక్కరి బాధ్యత




(నేటి శుభోదయ):ప్రతి బిడ్డ బడికి వచ్చేలా చైతన్యం తేవాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉంది గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, చేసిన కార్యక్రమాలకు రూ.46.5 కోట్ల సీఎస్ఆర్ నిధులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం సీఎస్ఆర్ నిధులతో సహకరిస్తున్న ప్రతి కంపెనీకి ధన్యవాదములు వెంకటాచలం మండలం కురిచెర్లపాడు పంచాయతీ పరిధిలోని నాలుగు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంతోషిమాత ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో క్రీడాపరికరాల పంపిణీ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చిన్నారుల కోసం క్రికెట్, ఫుట్ బాల్, బ్యాడ్మింటన్ కిట్లు, స్కిప్పింగ్ రోప్స్, క్యారంబోర్డులు, చెస్ బోర్డులు, స్టోరీ బుక్స్, స్టేషనరీ, సీలింగ్ ఫ్యాన్లు, ప్రొజెక్టర్లు, ప్రింటర్ అందించిన సంతోషిమాత ఆయిల్ అండ్ ఫాట్స్ కంపెనీ సోమిరెడ్డి కామెంట్స్ గిరిజన కాలనీ చిన్నారులను అంగన్ వాడీ, స్కూళ్లకు వచ్చేలా సచివాలయ ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలి చదువుకుంటే కలిగే ప్రయోజనాల విషయంలో గిరిజనుల్లో చైతన్యం తేవాలి పుస్తకాలు, దుస్తులతో పాటు మధ్యాహ్నభోజనం అందుతాయని, తల్లికి వందనం పథకంతో ఒక్కో బిడ్డకు రూ.13 వేలు చొప్పున సాయం అందుతుందని తెలియజేయాలి వైసీపీ పాలనలో గిరిజనులకు ఆధార్ కార్డు ఇప్పించడంపైనా సచివాలయ ఉద్యోగులు దృష్టి పెట్టలేదు



కూటమి ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల మందికి కొత్తగా ఆధార్ కార్డులు ఇప్పించాం కేవలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడమే కాదు..ప్రజల కష్టనష్టాలను తెలుసుకోవాలనే సామాజిక బాధ్యతతోనూ మెలగాలి సమాజంలో మనతో సమానంగా పుట్టిన గిరిజనుల అభ్యున్నతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి గిరిజనులు, నిరుపేదల ోసం మనం పడుతున్న తాపత్రాయానికి సర్వేపల్లి నియోజకవర్గంలోని కంపెనీల సహకారం కలిసొస్తోందినియోజకవర్గ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని 143 అంగన్ వాడీ కేంద్రాలకు సౌత్ ఇండియా కంపెనీ టీవీ, గ్యాస్ స్టౌవ్, కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లు, కుర్చీలు తదితర వస్తువులను అందజేస్తోంది సీఎస్ఆర్ నిధుల కోసం ప్రతి కంపెనీకి ప్రత్యేక వినతులు పంపుతున్నాం..సానుకూల స్పందన లభిస్తోంది చిన్నారుల కోసం ఈ రోజు ఈ కార్యక్రమం చేపట్టిన సంతోషిమాత ఆయిల్ అండ్ ఫ్యాట్స్ కంపెనీకి ప్రత్యేక ధన్యవాదములు

## జన గణన దేశ భవిష్యత్తుకు పునాది

**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము -జన గణన ప్రారంభించిన ఎమ్మెల్యే**

**-బిఅపోహలు వద్దు...జన గణనలో అందరూ పాల్గొనండి:ఎమ్మెల్యే రాము**



గుడివాడ ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ)జన గణన దేశ భవిష్యత్తుకు పునాదని, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, అభివృద్ధి ప్రణాళికలకు ఎంతో కీలకమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ రాజేంద్రనగర్ లోని స్వగృహంలో పురపాలక సంఘ పరిధిలో జనగణనను ఎమ్మెల్యే రాము గురువారం ప్రారంభించారు. ముందుగా కమిషనర్ సింహాద్రి మనోహర్ తో కలిసి సెన్సెక్స్ లోగో ఆవిష్కరించిన ఎమ్మెల్యే తొలి విడత నమోదులో భాగంగా ప్రభుత్వ పోర్టల్లో స్వయంగా గృహ జాబితా, వసతులు, తన కుటుంబ వివరాలు నమోదు చేశారు.ఈనెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు తొలి విడతగా ఇళ్ల జాబితా,వసతుల స్వీయ గణన జరుగుతుందని కమిషనర్ మనోహర్ తెలిపారు. మే 1 నుండి 30 వరకు రెండో విడతలో ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయి గణన జరుగుతుందని కమిషనర్ తెలిపారు.ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ జనగణనలో గుడివాడ ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.నా కుటుంబ వివరాలను స్వీయ గణనలో నమోదు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. రెండో విడతలో జన గణన ఎన్యుమరేటర్లు మీ ఇంటికి వచ్చినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పకడ్బందీగా రెండు విడతలగా గణన నిర్వహిస్తుందని, ప్రజలు అపోహలకు తావు లేకుండా జనగణనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మనందరం ఇచ్చే సమాచారం వల్లే రేపు రోడ్లు, స్కూళ్లు ,, హాస్పిటల్స్, సంక్షేమ పథకాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు మన చెంతక చేరుతాయని ఎమ్మెల్యే రాము అన్నారు. పౌరులందరూ జనగణనలో పాల్గొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్. టి. ఆర్. జిల్లా హెచ్. ఇ. సి. గ్రూప్ లో టాపర్ మాధురి

**-ప్రయివేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధన**



విజయవాడ, ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్. ఇ. సి. గ్రూప్ లో అత్యధిక మార్కులు సాధించిన యు. మాధురి జిల్లా టాపర్ గా నిలిచింది. మాధురికి 500 మార్కులకు గాను 466 సాధించింది. తెలుగు లో 100 కి 100 హిస్టరీ లో 100 కి 99 అత్యున్నత మార్కులు పొందటం విశేషం. హిస్టరీ సబ్జెక్టు లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం మార్కులు మాధురి సొంతం చేసుకుంది. అత్యున్నత స్థాయిలో మార్కులు తెచ్చుకున్న మాధురిని కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యామాధురి, తెలుగు అధ్యాపకురాలు రూపశ్రీ, చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ పామర్తి లీలావతి, ఇంగ్లిష్ అధ్యాపకులు మహేష్, పరిమళ, సివిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకులు శేఖర్ బాబు, సురేష్, అనితకుమారి, షేక్ ఖాసీం పీరా లు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాధురి మాట్లాడుతూ తాను అత్యధిక మార్కులు సాధించడం వెనుక తన లెక్చరర్స్ కృషి ఎంతో ఉందని, వారు తనను అన్ని విధాలుగా ప్రోత్సహించడం వలన మంచి మార్కులు సాధించగలిగానని తెలిపింది. ఇంకా మార్కులు పెంచుకోవడానికి బెటర్మెంట్ రాస్తానని పేర్కొంది. ప్రయివేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యని బోధిస్తున్నారని ప్రతి ఒక్కరు ప్రభుత్వ కళాశాలల్లో చేరి ర్యాంకులు సాధించ వచ్చని మాధురి తెలిపింది.నా లెక్చరర్స్ సూచనలు, సలహాల మేరకు సివిల్స్ సాధించడమే తన ధ్యేయమని మాధురి తెలిపింది.

## 'బ్లేజ్ వాడ' ఎండల్లోనూ ఇంద్రకీలాద్రి పటిష్టతపై ముమ్మరంగా సాగుతున్న శాస్త్రవేత్తల అధ్యయనం



విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన కొండ చరియల పటిష్టతపై శాస్త్రీయ అధ్యయనం చేయడానికి వచ్చిన బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ శాస్త్రవేత్తల బృందం తమ క్షేత్రస్థాయి పరిశోధనలను ముమ్మరం చేసింది. ఈ సాంకేతిక బృందం ఈ నెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఇక్కడ సమగ్ర సర్వే నిర్వహించనుంది.తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య ప్రస్తుతం విజయవాడ 'బ్లేజ్ వాడ'ను తలపిస్తూ అత్యధిక ఉష్ణోగ్రతలతో నిప్పులు చెరుగుతున్నప్పటికీ, భక్తుల భద్రతే ధ్యేయంగా శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో అకుంఠిత దీక్షతో పని చేస్తున్నారు.రెండవ రోజైన గురువారం కొండలైట్ రాతి స్వరూపంతో కూడిన ఇంద్రకీలాద్రిపై, హెచ్చు ఉష్ణోగ్రతల వల్ల రాళ్లలో కలిగే మార్పులను, వాటి పటుత్వాన్ని ఈ బృందం నిశితంగా పరిశీలిస్తోంది.జాతీయ రహదారి వెంట, ఘాట్ రోడ్ల వెంబడి బయటకు కనిపిస్తున్న కొండ రాళ్ల పొరల నుండి భూగర్భ సాంకేతిక భౌగోళిక నమూనాలను బృందం సేకరిస్తోంది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న ఈ సర్వేలో భాగంగా, అత్యాధునిక పరికరాల సహాయంతో రాళ్ల స్థితిగతులు, మట్టితో మిళితమైన ప్రాంతాలు మరియు తరచుగా రాళ్లు జారిపడే ప్రదేశాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు.రాబోయే రోజుల్లో కొండపై నిర్మించనున్న 'పాశుపాతాలయం' 2వ ఘాట్ రోడ్డు వంటి బృహత్తర ప్రణాళికలకు గల అనుకూల పరిస్థితులపై ఈ బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేస్తోంది.ఈ సర్వే నివేదిక ఇంద్రకీలాద్రి భవిష్యత్ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుంది. ఈ అధ్యయనం ఆధారంగా చేపట్టే రక్షణ చర్యల వల్ల భక్తులకు కొండ చరియల ముప్పు నుండి శాశ్వత విముక్తి లభించడమే కాకుండా, దేవస్థాన మాస్టర్ ప్లాన్ను పకడ్బందీగా అమలు చేయడానికి మార్గం సుగమం అవుతుంది.అత్యాధునిక సాంకేతికత, శాస్త్రీయ దృక్పథంతో రూపొందించే ఈ కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదికతో ఇంద్రకీలాద్రి మరింత సురక్షితమైన, సుందరమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లనుందని, భవిష్యత్ కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక ప్రజా ప్రతినిధుల చొరవతో ముందడుగు పడిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ అన్నారు శాస్త్రవేత్తలు ఇంద్రకీలాద్రి పై సర్వే సందర్భంగా గమనిస్తున్న విషయాలు పై ప్రతీ రోజు అధ్యయనం చేస్తున్నామని, ఈ సర్వే నివేదిక ఆలయ భవిష్యత్ అభివృద్ధికి ఒక సమగ్ర కరదీపిక గా ఉపయోగపడుతుందని ఈవో పేర్కొన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్ష పదవితో బాధ్యతలు మరింత పెరిగాయి: బొండా ఉమా





విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి లభించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తనకు కొత్తది కాదని, గత 25 సంవత్సరాలుగా పార్టీతో అఖండ అనుబంధం కొనసాగిస్తూ, ఒక సామాన్య కార్యకర్తగా ప్రారంభమైన తన రాజకీయ ప్రయాణం నేటి ఈ స్థాయికి చేరుకోవడం పార్టీ ఇచ్చిన అవకాశాలు, నాయకత్వం చూపిన నమ్మకమే కారణమని తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు చూపిన అపారమైన ప్రేమ, విశ్వాసంతోనే తాను అత్యధికంగా సుమారు 70 వేల మెజారిటీతో గెలిచానని, ఆ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రజలకు సేవ చేయడం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు, పదవులు అనేవి కేవలం బాధ్యతల కోసం మాత్రమేనని, కానీ ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటూ, వారి సమస్యలను ఎంత త్వరగా పరిష్కరిస్తామన్నదే నిజమైన నాయకత్వమని అన్నారు. ప్రజల కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా పనిచేయడం తన ప్రధాన ధ్యేయమని బొండా ఉమా తెలిపారు. ముఖ్యంగా బలహీన వర్గాలు, కార్మికులు, సాధారణ ప్రజల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తెలుగుదేశం పార్టీపై తనకు ఉన్న అచంచల నమ్మకం, నిబద్ధత వల్లనే ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించిన పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం, ప్రజా సేవ కోసం మరింత కృషి చేస్తానని ఉమా స్పష్టం చేశారు.

## ఇంటర్ ఫలితాలలో విసన్నపేట ప్రైవేట్ కళాశాలల ప్రభంజనం

విసన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్)విసన్నపేటలోని సిద్ధార్థ,వికాస్,శ్రీశ్రీ ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు.ద్వితీయ సంవత్సరం యంపిసి విభాగంలో ఏ.పూజిత 990 మార్కులతో అగ్రస్థానంలో నిలువగా కె లోహిత 989,ఎస్ లిఖిత శ్రీ 986 మార్కులు సాధించారు.బైపిసి విభాగంలో షేక్ ఉమర్ బి 978 మార్కులు సాధించగా భూక్యా మనీషా 970 మార్కులు తాళ్ల జాస్మిన్ సుహాని 967మార్కులు సాధించి తమ సత్తా కనబరిచారు సీఈసీ విభాగంలో పులి సంహిత్ 933,తోట లోకేష్ 931 మార్కులు సాధించారు.మొత్తం 950 పైగా మార్కులు 100 మంది విద్యార్థులు సాధించడం విశేషం.ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బి.నిత్యశ్రీ,,ఎన్.నవ్యశ్రీ,,ఏ అక్షయ ఈ ముగ్గురు 464 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో టీ.అనురాధ 447,ఎం. దీపికా మాధురి 446,కొండ లేఖన 446 మార్కులు సాధించగా సీఈసీ నుండి రవి గుప్త 468,పి.శశికుమార్ 454 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.ఇంకా ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 450 పైగా మార్కులు 56 మంది విద్యార్థులు సాధించగా,బైపీసీ విభాగంలో 435 పైగా మార్కులు 12 మంది,సీఈసీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు 450 పైగా మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.ఈ సందర్భంగా కళాశాలల ప్రతినిధులు విద్యార్థులను అభినందించి వారి విజయానికి కృషి చేసిన అధ్యాపకులను ప్రశంసించారు.

## ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల కోసం చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేసిన బొండా ఉమా



విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- సెంట్రల్ లోని 36వ డివిజన్ గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విజయవాడ నగరంలో మండుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలను వేగవంతం చేసిందన్నారు. ప్రస్తుత హీట్‌వేవ్ పరిస్థితుల్లో అత్యవసర పరిస్థితులు తప్ప ప్రజలు ఎండలో బయటకు రావద్దని అధికార యంత్రాంగం తరఫున విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నగరంలోని ప్రతి ముఖ్య కేంద్రంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి చల్లని తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆటో కార్మికులు, రిక్షా కార్మికులు, అసంఘటిత కార్మికులు, మహిళలు, బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మజ్జిగ, చల్లని తాగునీటి పంపిణీ చేపడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వరరావు, నారాయణ స్వామి హాస్టల్ సమీపంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ప్రజలు చిన్న చిన్న పనులకైనా ఎండలో బయటకు వెళ్లి అనారోగ్యానికి గురికావద్దని, వడదెబ్బల నుంచి అప్రమత్తంగా ఉండాలని కోరారు, హీట్‌వేవ్ పరిస్థితులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు, ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బొందిలి సంగం రాష్ట్ర కనివ్వనర్ నందేటి చంద్రభాను సింగ్, 36వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి రాము, సెక్రటరీ లక్ష్మణ్ గారు, రాష్ట్ర బందులు కార్పొరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అజిత్ సింగ్ నగర్‌లో సోలార్ ప్లాంట్ ప్రారంభంపేదలకు ఉచిత విద్యుత్ దిశగా ప్రభుత్వం కీలక అడుగు: బోండా ఉమా



విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- 58వ డివిజన్ సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో గురువారం "పీఎం సూర్యఘర్ సోలార్" పథకం కింద 2 కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ ప్లాంట్‌ను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వర రావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమా గారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పీఎం సూర్యఘర్" పథకం ద్వారా సామాన్య ప్రజలకు, ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ వర్గాలకు చెందిన కుటుంబాలకు పెద్ద ఎత్తున లాభం చేకూరుతోందని తెలిపారు. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా 2 కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, వారికి దీర్ఘకాలికంగా విద్యుత్ ఖర్చులను తగ్గించే అవకాశం కల్పిస్తోందని చెప్పారు.ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్న కుటుంబాన్ని స్వయంగా వారి నివాసానికి వెళ్లి అభినందించిన ఆయన, ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించి, ఇకపై వారికి విద్యుత్ బిల్లుల భారం లేకుండా ఉచిత విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సౌర శక్తి వినియోగం ఎంతో ముఖ్యమని, సోలార్ ఎనర్జీ వినియోగం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రతి ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణల వల్ల ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుతోందని, అదే సమయంలో విద్యుత్ ఖర్చులను కూడా తగ్గించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబం ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. కొండలరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవింద రాజులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. కిరణ్ కుమార్, ఇతర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కరెంట్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన బోండా ఉమా




విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- సెంట్రల్ లోని 23వ డివిజన్ బీసెంట్ రోడ్ అన్సారీ పార్క్ లో గురువారం 12.4 కోట్ల వ్యయంతో కరెంట్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ :-రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని,గత వైసీపీ ప్రభుత్వ కాలంలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగి, ట్రూ-అప్ ఛార్జీలు, అదనపు చార్జీలు వంటి పేర్లతో ప్రజలపై వేల కోట్ల భారం మోపబడిందని, అయితే, ప్రస్తుత చీణూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై ఎలాంటి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గత 21 నెలల కాలంలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో గ్రామాల్లో రోజుకు 5-6 గంటలు మాత్రమే విద్యుత్ అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోందని, రైతులకు కూడా సమృద్ధిగా విద్యుత్ అందించబడుతోందని, రాష్ట్రంలో పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు పూర్తయితే భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగి, లోటు పరిస్థితి నుంచి మిగులు విద్యుత్ స్థితికి చేరుకుంటామని తెలిపారు, దీంతో రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలను మరింత తగ్గించే అవకాశముందని, ఈ క్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుపరచేందుకు కీలక చర్యలు చేపట్టామని ఏలూరు లాక్ ల సమీపంలో ఒకటి, బీసెంట్ రోడ్డు అన్సారీ పార్క్ వద్ద మరొకటి ఇలా రెండు సబ్ స్టేషన్ల నిర్మాణానికి సుమారు 6.20 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, ఈ సబ్ స్టేషన్లు పూర్తయిన తరువాత ఎక్కడా లో వోల్టేజ్, లేదా పవర్ సమస్యలు లేకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ అందుబాటులో ఉంటుందని బొండా ఉమా తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండే నేపథ్యంలో, ఎటువంటి పవర్ కట్‌లు లేకుండా నిరంతర సరఫరా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు, అవసరమైతే మరిన్ని సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలపై భారం లేకుండా, విద్యుత్ బిల్లులు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. ఎ. వా. చీ మూర్తి, సూపరిండెంట్ ఇంజనీర్ ఖ. హనుమయ్య, మాజీ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, విద్యుత్ శాఖ అధికారులు ఖ. కొండలరావు, బసవరాజు, సురేష్, రవి కిషోర్, రామ ప్రభు, వసంత రాజు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ నగర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, వి.యం.సి స్పెషల్ ఆఫీసర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తమ చాంబర్లో శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా నగరంలోని మినీ ఎస్టిపిల పురోగతి, డివిజన్ల పెంపు, జనగణన శిక్షణ కార్యక్రమాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. విఎంసి సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్రీడా కార్యక్రమాలను ఈ నెల 25, 26 తేదీలలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బారుకు వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి: ఎమ్మెల్యే కృష్ణప్రసాదు




విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- ప్రజాదర్బాకు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అధికారులను ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిష్కారం అయ్యేంత వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు' కార్యక్రమ నిర్వహణ నిదర్శనమన్నారు. ప్రజదర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

## "కార్యకర్తే అధినేత" అన్న నమ్మకంతో చిన్న కార్యకర్తను పొలిట్ బ్యూరో స్థాయికి తీసుకెళ్లాలనే దృఢ సంకల్పం ఉన్న నాయకుడు లోకేష్ కి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించడం శుభ పరిణామం"

**- తెదేపా యువనేత బోడే వెంకట్రామ్**



పెనమలూరు, ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో,ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదేశాల మేరకు భవిష్యత్తు నాయకుడు నారా లోకేష్ కి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు దక్కిన సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు.యువనేత బోడే వెంకట్రామ్ నాయకత్వంలో నియోజకవర్గ తెదేపా శ్రేణులు భారీగా తరలి వచ్చి కేక్ కటింగ్ చేసి,ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బోడే వెంకట్రామ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లో నమ్మకం నింపిన నాయకుడు లోకేష్ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో అధినేత నారా చంద్రబాబు నాయుడుకి అండగా నిలిచారని తెలిపారు."కార్యకర్తే అధినేత" అనే సిద్ధాంతంతో క్షేత్ర స్థాయి కార్యకర్తకు గుర్తింపు తీసుకొచ్చే విధంగా పార్టీ నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన నాయకుడు లోకేషే నని కొనియాడారు.పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపుతూ, శిక్షణా కార్యక్రమాల ద్వారా నాయకత్వాన్ని తీర్చిదిద్దుతున్న లోకేష్ విజన్‌నే గురువారం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలకు కారణమని స్పష్టం చేశారు.ఇకపై లోకేష్ నాయకత్వంలో క్షేత్ర స్థాయి కార్యకర్తలతో కలసి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వెలగపూడి శంకర్ బాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు,పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద ప్రసాద్, సీనియర్ నాయకులు దేవినేని రాజా, తుమ్మలపల్లి హరికృష్ణ, జంపాన గురునాథం, జంపని వెంకటేశ్వరరావు, అనంతనేని ఆజాద్, దొనేపూడి రవి కిరణ్, బొంగరాల అబ్రహం, నేరుసు సతీష్. నేరుసు రాజ్యలక్ష్మి,యార్లగడ్డ సుచిత్ర, మేడసాని రత్నకుమారి, మల్లంపాటి విజయలక్ష్మి, దోనేపూడి రమాదేవి,బొప్పన నీరజ, షేక్ సలీం,మురళి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా జాతీయ ఉపాధ్యక్షులుగా వై. వి. బి. రాజేంద్రప్రసాద్ ను నియమించడం హర్షనీయం



**-తెదేపా నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు.**

ఉయ్యూరు, ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన కమిటీలలో తెదేపా జాతీయ ఉపాధ్యాయులుగా రాజేంద్రప్రసాద్ ని నియమించడం పట్ల ఉయ్యూరు లోని పలు సంఘాల ప్రతినిధులు, తెదేపా నాయకులు రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల అంకిత భావంతో ఉంటూ, పార్టీకి ఎనలేని సేవలు అందించిన రాజేంద్రప్రసాద్ ని తెదేపా జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించడం మా అందరికీ ఆనందదాయకమని అన్నారు.పార్టీ ఆది నుంచి పార్టీలోనే కొనసాగుతూ అనేక పదవులు చేపట్టినా పార్టీ కార్యకర్తలకు అండగా వుండే వ్యక్తి రాజేంద్రప్రసాద్ అని అన్నారు కష్టంలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుండే వ్యక్తికి సరయిన పదవి ఇచ్చారని, పార్టీకి అంకిత భావంతో పనిచేసే రాజేంద్రప్రసాద్ అభినందనీయుడన్నారు.ఈ కార్యక్రమంలో వెంట్రప్రగడ శేషు, హాస్పిటల్ కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, నేరెళ్ల గుప్త, బోళ్ళపాడు పి.ఎ.సి చైర్మన్ లక్ష్మారెడ్డి, ఎంట్రప్రగడ ఆంజనేయులు, మురాల వెంకటేశ్వరరావు, నడిమింటి పైడయ్య, పారుపూడి కుచేలుడు,తేజ మొబైల్స్ తేజ, రంగారావు, కనగల నాని, సయ్యద్ గఫూర్, జంపాన తేజ, రామనాల శ్రీకాంత్, శేషగిరి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు

## మంతెన వెంకటరాజు సేవలు చిరస్మరణీయం

**: జనసేన నాయకుడు విన్నకోట సురేష్**



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 16 :బాపట్లలో జరిగిన మంతెన వెంకటరాజు 58వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంతెన వెంకటరాజు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన అరుదైన నాయకుడని కొనియాడారు. రాజకీయాలను ప్రజల సంక్షేమానికి వేదికగా మలచి, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన గొప్ప వ్యక్తిత్వం వెంకటరాజు గారిదని తెలిపారు. ఆయన చూపిన నిబద్ధత, నిజాయితీ, సేవాభావం నేటి నాయకులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి, ప్రజలతో కలిసిమెలిసి పనిచేసిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని సురేష్ అన్నారు. అలాంటి మహనీయుని స్మారకార్థం



విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయం అని, యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనంతపరమరాజు, తెలుగుదేశం పార్టీ నాయకుడు తాతా జయప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంట అంజిబాబు, తదితర రాజకీయ పార్టీ నాయకులు రాజులు అభిమానులు పాల్గొని వెంకటరాజు గారికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## శిరోరక్ష - ప్రాణరక్ష హెల్మెట్ అవగాహన మరియు ప్రతిరోజు హెల్మెట్ తప్పనిసరిగా ధరించలి కార్యక్రమం నిర్వహించిన బాపట్ల రూరల్ సీఐ ప్రభాకర్

బాపట్ల నేటి శుభోదయ (రవి కిరణ్) ఏప్రిల్ 16: బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు గారి ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పి చంద్రమౌళి గారి సూచనలు మేరకు బాపట్ల రూరల్ సీఐ ప్రభాకర్ గారి పర్యవేక్షణలో మహిళా ఎస్సై అలేఖ్య వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన మరియు వాహన తనిఖీ




కార్యక్రమం సూర్యలంక రోడ్డులోని నిర్వహించారు . "శిరోరక్ష– ప్రాణరక్ష "హెల్మెట్ అవగాహన కార్యక్రమంలో భాగంగా రూరల్ సీఐ ప్రభాకర్ వాహనదారులు తో మాట్లాడుతూ వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించవలెను వాహనదారుడు తో పాటు వెనక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలి ముఖ్యంగా హెల్మెట్ అనేది 90 శాతం యాక్సిడెంట్ నుంచి ప్రాణాలు కాపాడే ఒక ఆయుధం.ఇటీవల కాలంలో చాలా యాక్సిడెంట్ లో మరణించిన వారు ఎక్కువ మంది హెల్మెట్ లేకపోవడం వల్లనే హెల్మెట్ అనేది భారం కాకుండా బాధ్యతగా ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపి మన చుట్టుపక్కల ఉన్న వాళ్లకి ఆదర్శంగా నిలవాలి. చిన్నపిల్లల కూడా వాహనం మీద ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలి నాణ్యమైన హెల్మెట్లు ధరించి వాహనదారులు తమ ప్రాణాల్ని రక్షించుకో వాల్సింది గా తెలియజేశారు.ముఖ్యంగా హెల్మెట్ ధరించటం వల్ల యాక్సిడెంట్ అయినప్పుడు తలకి దెబ్బ తగలకుండా చిన్నపాటి గాయాలతో మన ప్రాణాల్ని రక్షించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రభాకర్ ,మహిళా ఎస్సై అలేఖ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-తమిరిశ గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే.**

**-అర్జీలు అందించిన ప్రజలు....పి.జే.ఆర్.ఎస్ లో నమోదు**



నందివాడ ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు.గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకే చిత్తశుద్ధితో పనిచేస్తున్నానన్నారు. నందివాడ మండలం తమిరిశ గ్రామంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే రాము ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలు అందించేందుకు తమిరిశ పరిసర గ్రామాల ప్రజలు పోటెత్తారు.ప్రజల నుండి సమస్యల అర్జీలను అందుకున్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. ప్రభుత్వ పాలసీ, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి కొంత ఆలస్యం అవుతుందని కచ్చితంగా వాటిని కూడా పరిష్కరిస్తానని అర్జీలు అందించిన వారికి ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు.అనంతరం గ్రామస్తులు ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ నమ్మి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో శక్తివంతం లేకుండా పనిచేస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో తమిరిశ గ్రామంలో కోటి 90 లక్షలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. అర్జీలు అందించిన ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు సాయి గంగా రాజు, పెదబాబు, తోట వెంకటేశ్వరరావు, పిల్ల సాల్మన్ రాజ్, మద్దాలి కరుణాకర్, సత్యనారాయణ, ఎమ్మార్వో గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓ మల్లేశ్వరి, హౌసింగ్ ఏ ఇ పృధ్వి, ఎ. ఇ. రూపేష్, ఎం. ఇ. ఓ. డేవిడ్ రాజ్, డ్రైనేజ్ ఏ ఈ అనిల్, ఇరిగేషన్ ఏఈ అరుణ్ కుమార్ పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉయ్యూరు మున్సిపల్ కమీషనర్ గా శుభాస్ చంద్రబోస్

ఉయ్యూరు,ఏప్రిల్ 16 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఉయ్యూరు మున్సిపల్ కమీషనర్ గాసుభాష్ చంద్రబోస్ ను నియమిస్తూ గురువారం మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈయన గుంటూరు జిల్లా వినుకొండ మునిసిపల్ కమీషనర్ గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ పై వచ్చారు. వెంటనే విధుల్లో చేరి పదవీ భాద్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డ్రైనేజి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**- మునిసిపల్ కమీషనర్ మనోహర్**



గుడివాడ, ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) గుడివాడ పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ గురువారం 36వ వార్డులో పర్యటించి అక్కడి మౌలిక వసతులను పరిశీలించారు. వార్డులో తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించారు.కొత్త డ్రైనేజీ నిర్మాణం కోసం సిద్ధం చేసిన ప్రతిపాదనలకు సంబంధించిన వివరాలను పరిశీలించిన కమిషనర్, అందులో పలు లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అన్ని వార్డులను మరోసారి సమగ్రంగా పరిశీలించి, సవరించిన ప్రతిపాదనలను త్వరగా సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇళ్లు ఉన్న ప్రతి ప్రాంతంలో డ్రైనేజీ సౌకర్యం తప్పనిసరిగా ఉండాలని, రహదారి ఉన్నా లేకపోయినా డ్రైనేజీ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ , అసిస్టెంట్ ఇంజినీర్ తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## జనాభా గణన ప్రతి ఒక్కరు సొంతంగా ఆన్లైన్ పోర్టల్ ద్వారా 30వ తేదీలోగా చేసుకోవాలి

**-కృష్ణాజిల్లా కలెక్టర్ డి. కే. బాలాజీ**




మచిలీపట్నం ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) జనాభా గణన ప్రతి ఒకరు సొంతంగా ఆన్లైన్ పోర్టల్ ద్వారా ఈనెల 30వ తేదీ వరకు చేసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా గురువారం నుండి ప్రారంభమైన జనగణన ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో తన కంప్యూటర్ లో స్వీయ జనగణన ఆన్లైన్ పోర్టల్ అఅ ద్వారా తన సొంత వివరాలను నమోదు చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు.ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వచ్చి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టి స్వీయ గణనను ధృవీకరిస్తారన్నారు. పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ జనగణన కార్యక్రమం సమాచార సేకరణ మాత్రమే కాకుండా రానున్న రోజుల్లో అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగనుందని మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ మొదలవుతుందన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇండ్ల జాబితా ఇండ్ల గణన, కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అందరూ సెల్ఫ్ ఎన్యుమరేషన్ లో పాల్గొనండి

విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- అందరూ స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) లో పాల్గొనాలని అదనపు కమిషనర్, సిటీ సెన్సెస్ ఆఫీసర్ ఏ. రవీంద్రరావు అన్నారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సెల్ఫ్ అన్యుమరేషన్ చేసి అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ ఏ. రవీంద్రరావు మాట్లాడుతూ నగర పరిధిలోగల మూడు నియోజకవర్గాలలోని శాసనసభ్యులు జన గణన లో పాల్గొనారని అన్నారు. జన గణన ఎంతో ముఖ్యమైన అంశమని ప్రజలందరూ జనాభా లెక్కల్లో పాల్గొని దేశాభివృద్ధికి తోడ్పడాలని, అందులో మొదటి అడుగు స్వీయ గణనని అన్నారు. ప్రజలందరూ తమ వివరాలను స్వయంగా లో తామే నమోదు చేయవచ్చని ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు ఉంటుందని కావున ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, తహసిల్దార్ ఈస్ట్ వి. రోహిణి దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలి

**తూర్పులో జనగణన ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె**




విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- దేశ ప్రగతికి అవసరమైన జనాభా లెక్కలను వచ్చే ఏడాది 2027వ సంవత్సరంలో ప్రారంభించనున్నారని, అందుకు తొలి దశలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా చేపట్టిన చేపట్టిన సల్ఫ్ అసెస్‌మెంట్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఖచ్చితమైన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గంలో సెల్ఫ్ అసెస్‌మెంట్ (స్వీయ జనగణన)ను ఎమ్మెల్యే గద్దె పటమటలోని అశోక్‌నగర్‌లో ఆయన ఇంటి వద్ద ప్రారంభించారు. గద్దె తో పాటుగా విజయవాడ తూర్పు తహసీల్దార్ రోహిణీ దేవి, కార్పొరేషన్ జోనల్ కమీషనర్ షమ్మీ, డెప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, ఇతర అధికారులు వచ్చి శాసనసభ్యులవారి సమాచారాన్ని ఆన్‘లైన్ లో పొందుపరచి వారికి మొమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయడానికి జనాభా లెక్కలు ఎంతో కీలకమని తెలిపారు. అత్యధిక ప్రాధాన్యత కలిగిన ఈ జనగణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని, ఎన్యూమరేటర్లు వచ్చినపుడు వారికి తెలియజేయాలని ప్రజలను ఆయన కోరారు. జనగణనను తొలి సారిగా ఈవిధానంలో చేపట్టనున్నారని, ఖచ్చితమైన డేటా సేకరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని అందువల్ల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని చెప్పారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన (ఎస్ఇ.సెన్సస్.జఒవి.ఇన్) పోర్టల్‌లో ప్రజలు తమ వివరాలను పొందుపరచవచ్చునని అన్నారు. దీనివల్ల సమయం ఆదాతో పాటుగా దోష రహితంగా ఖచ్చితమైన డేటా లభిస్తుందని చెప్పారు. దీని వల్ల రానున్న కాలంలో నిర్వహించే జనాభా లెక్కల ప్రత్యక్ష సేకరణకు ప్రభుత్వ సిబ్బంది వచ్చినప్పుడు స్వీయ గణన ద్వారా అందించిన సమాచారాన్ని త్వరతగితిన



ధ్రువీకరించేందుకు వీలవుతుందన్నారు. స్వీయగణనలో 34 ప్రశ్నలు ఉంటాయని వాటిని పూర్తి చేయాలని చెప్పారు. 15 రోజుల పాటు అంటే, ఈ నెల 30వ తేది వరకు ఈ అవుట్‌రీచ్ క్యాంపెయిన్ కార్యక్రమం జరుగుతుందని, అప్పటిలోగా ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే గద్దె కోరారు.ఈ కార్యక్రమంలో టి.డి.పి. యువ నేత గద్దె క్రాంతి, మాజీ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కోనేరు రాజేష్ ఎ.సి.పి. మోహన్ బాబు, వి.ఎం.సి. సిబ్బంది మద్దినేని శివప్రసాద్, కమల, నాగేశ్వరరావు, ప్రభు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి తరం చదువులో రాణించాలి

**- పేద విద్యార్థికి రూ. 10 వేల సాయం చేసిన కోగంటి సత్యం**



విజయవాడ, ఏప్రిల్ 16 (నేటి శుభోదయ):- నేటి బాలలే రేపటి పౌరులని నేటితరం యువత చదువులో రాణించాలని ప్రముఖపారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ అన్నారు. గురువారం కృష్ణలంకలోని ఆయన ఆఫీసులో జక్కంపూడి కాలనీకి చెందిన షేక్ ఆలియా పిల్లలకు చదువుల నిమ్మితం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేసారు. ఈ సందర్భంగా కోగంటి మాట్లాడుతూ అన్నదానంతో పాటు విద్యాదానం చేయడం నాకెంతో సంతోషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సురేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత మనందరి బాధ్యత

**ఏ ఎస్పీ బొడ్డు హేమంత్ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, ప్రజలు**

**ర్యాలీ నిర్వహించిన చింతూరు సి ఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్**




చింతూరు డివిజన్ నేటి శుభోదయ:మహిళల రక్షణే ప్రధాన ధ్యేయంగా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని చింతూరు పోలీస్ సబ్ డివిజన్ ఏ ఎస్పి బొడ్డు హేమంత్ తెలిపారు. గురువారం చింతూరు డివిజన్ కేంద్రంలో చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మహిళల భద్రత మన బాధ్యత అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి చింతూరు ఎస్పీ బొడ్డు హేమంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, యువతులు వేధింపులకు గురికాకుండా షి టీమ్స్, మరియు స్థానిక పోలీసులు నిరంతరం నిఘ ఉంచుతున్నారని తెలిపారు మహిళలపై అసభ్య ప్రవర్తన వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు స్మార్ట్ ఫోన్ వినియోగంలో యువతులు జాగ్రత్తగా ఉండాలని అలాగే సైబర్ నేరాల నుంచి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో మహిళలు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని కోరారు ప్రతి మహిళ వారి ఫోన్లలో దిశ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని ఆపద సమయంలో ఒక బటన్ నొక్కితే పోలీసులు తక్షణమే స్పందిస్తారని ఆయన తెలిపారు అనంతరం విద్యార్థులు పుర ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని చింతూరు పోలీస్ స్టేషన్ నుండి స్థానిక ప్రధాన కూడలి వరకు ర్యాలీగా నిర్వహించి అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

## బాపట్ల పార్లమెంట్ సభ్యులు ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరిస్తున్న మన బాపట్ల పార్లమెంట్ సభ్యులు

**శ్రీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ గారికి టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా పదవి బాధ్యతలు అప్పగించిన సందర్భంగా బాపట్ల పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.**



బాపట్ల నేటి శుభోదయ ఏప్రిల్ 16 :ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కొత్త బాధ్యతలు చేపట్టిన తెన్నేటి కృష్ణ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పటాన్ రాజేష్ మాట్లాడుతూ, తెన్నేటి కృష్ణ ప్రసాద్ గతంలో నేడు చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎప్పుడూ ముందుంటారని అన్నారు. జాతీయ స్థాయిలో అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పటాన్ రాజేష్, భోగిరి రామారావు, నర్రా ఏడుకొండలు, గవిని దుర్గ ప్రసాద్, మద్దాల పాపయ్య, అండగుండం నారాయణ, గద్దె హేమసుందరావు, ఇనగంటి రాంబాబు, బోయిన వెంకన్న, బడుగు పృధ్వీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసులుకు వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బాధ్యతలు



పులిచెర్ల, ఏప్రిల్ 16,(నేటి శుభోదయ) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైసీపీ ఎస్సీ సెల్ చిత్తూరు జిల్లా కార్యదర్శిగా పులిచెర్ల మండలం, వెంకటాదసరపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ను నియమిస్తూ పార్టీ అధిష్టానం అధికారిక ప్రకటన విడుదల చేసింది. శ్రీనివాసులు గతంలో పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ, దళితుల సమస్యలపై పోరాటం చేస్తూ మంచి గుర్తింపు పొందారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధినేత శ్రీనివాసులు కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన మాజీమంత్రి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.

## గన్నవరం పాలిటెక్నిక్‌లో 100శాతం ప్లేస్‌మెంట్లు

**132 మంది విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లు పంపిణీ చేసిన విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ**



గన్నవరం, ఏప్రిల్ 16( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవం, జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాలలో నాలుగు విభాగాలకు చెందిన మొత్తం 132 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడంతో 100 శాతం ప్లేస్‌మెంట్లు నమోదయ్యాయి. గతంలో కొన్ని బ్రాంచ్‌లకు పరిమితమైన అవకాశాలు ఉండగా, ఈసారి అన్ని విభాగాల్లోనూ పూర్తి స్థాయి ప్లేస్‌మెంట్లు సాధించడం విశేషంగా నిలిచింది. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసి అభినందించారు. కృషి, పట్టుదలతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరానికి సి-డాక్ సంస్థను తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడుతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే, మేధా టవర్‌లో క్వాంటం వ్యాలీ రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వచ్చే నెల నుంచి హెచ్‌సిఎల్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కళాశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, రూ.30 లక్షల నిధుల కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. కంప్యూటర్ల కోసం ఓఎన్‌జీసీతో చర్చలు జరుగుతున్నాయని, కాలేజీ మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్, ఐటీఐ చదువులు పూర్తి చేసిన వారికి తక్కువ వయసులోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్ సిఐ బివి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కార్యాలయ అర్జీలను క్షేత్రస్థాయిలో విచారణ


**కృష్ణాజిల్లా కలెక్టర్ డి. కే. బాలాజీ**



మచిలీపట్నం, ఏప్రిల్ 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీలు సమర్పించిన ఇద్దరు అర్జీదారులతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం సాయంత్రం స్వయంగా మాట్లాడారు. గుడివాడ మండలం పర్నాస గ్రామానికి చెందిన పల్లపోతు ఏడుకొండలు, తమ ట్రాక్టర్ ద్వారా ధాన్యం ఇంటికి తరలించేందుకు రహదారి ఆక్రమణల వల్ల ఇరుకుగా మారిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని, అలాగే పెనమలూరు మండలం తాడిగడప మున్సిపాలిటీకి చెందిన ఎన్. సీతమ్మ, తమ గృహాల సమీపంలో గేదెల రొచ్చు కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విస్తరిస్తున్నాయని, దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి ఫోన్ ద్వారా అర్జీదారులతో మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ తో పాటు మీకోసం కార్యక్రమం డిప్యూటీ తహసిల్దార్ బేగ్ ఉన్నారు.

## కాకినాడ పోర్టు వద్ద పీడీఎస్
## బియ్యం అక్రమ ఎగుమతి బహిర్గతం

**- 910 టన్నుల బాయిల్డ్ రైస్ సీజ్, రూ.3.54 కోట్ల విలువ చేసే బియ్యం**



కాకినాడ, నేటి శుభోదయ ::: కాకినాడ యాంకరేజ్ పోర్టు పరిసరాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ ఎగుమతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీ స్థాయిలో అవకతవకలు బయటపడ్డాయి.పోర్టు సమీపంలో భార్జీలు, రైల్వే వ్యాగన్‌లలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించిన అధికారులు, చెక్‌పోస్ట్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బాయిల్డ్ రైస్, రా రైస్, రా బ్రోకెన్స్ ఎగుమతి విధానంపై వివరాలు సేకరించారు. టెక్నికల్ సిబ్బంది నమోదు చేసిన రికార్డులను సమీక్షించి సూచనలు ఇచ్చారు. తదుపరి మానస ఎంటర్‌ప్రైజెస్ గోదాం, స్వార్టెక్స్ ప్లాంట్లు, ఎన్‌డీఆర్ గోదాం, చిత్ర ఆగ్రో ఎగ్జిట్స్, కొవ్వూరి ఆనంద్ రెడ్డి నిర్వహిస్తున్న సార్టెక్స్ యూనిట్‌లలో తనిఖీలు చేపట్టారు. అక్కడ 10 లారీలలో బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. శాంపిల్స్‌ను పరీక్షించగా బాయిల్డ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు తేలింది. సాధారణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరఫరా చేసే బియ్యంలోనే ఇవి ఉంటాయని అధికారులు తెలిపారు. మిల్‌లోనూ ఇదే రకం బియ్యం నిల్వ ఉన్నట్లు నిర్ధారించారు.విచారణలో, ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు బయటపడింది. - భారీగా సీజ్ ఈ చర్యల్లో భాగంగా మొత్తం 910 టన్నుల బాయిల్డ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 10 లారీలలో 260 టన్నులు ప్లాంట్‌లో 650 టన్నులు. మొత్తం విలువ సుమారు రూ.3.54 కోట్లు ఉండగా, ఇందులో లారీల బియ్యం విలువ రూ.1 కోటి వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపిన వివరాల ప్రకారం, అనాలసిస్ రిపోర్టుల కోసం నమూనాలు పంపించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఎగుమతి చేయడం నేరమని, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# హోం శాఖపై వస్తున్న ఆరోపణలపై..
# సీఎం సమాధానం చెప్తారా

**హోం శాఖ కూడా రేవంత్ రెడ్డి వద్దే ఉండడంతో ఆ శాఖలో జరిగే ప్రతి చిన్న పొరపాటు కూడా ఆయన వైఫల్యంగానే ప్రజలు చూసే ప్రమాదం ఉంది.**



ఒక ప్రభుత్వానికి 'శాంతిభద్రతలు' అనేవి వెన్నెముక వంటివి. ప్రభుత్వం ఎన్ని వేల కోట్లు ఖర్చు చేసి సంక్షేమ పథకాలు అమలు చేసినా, సామాన్య పౌరుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు అతనికి అక్కడ సరైన గౌరవం, న్యాయం దక్కకపోతే ఆ అసంతృప్తి నేరుగా ముఖ్యమంత్రి పైనే పడుతుంది. హోం శాఖ కూడా రేవంత్ రెడ్డి వద్దే ఉండడంతో ఆ శాఖలో జరిగే ప్రతి చిన్న పొరపాటు కూడా ఆయన వైఫల్యంగానే ప్రజలు చూసే ప్రమాదం ఉంది. రేవంత్ సర్కార్‌కు 'హోం' గండం తప్పదా

**- బీటక్ రవి ఇలా అయితే కష్టమే బాసు...!**

ప్రభుత్వానికి పోలీసులు ముఖచిత్రం లాంటి వారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆ ముఖచిత్రం కొంత మసకబారుతున్నట్లు కనిపిస్తోంది. రంగారెడ్డి జిల్లా, మీర్‌పేట ఎస్‌ఐ నాగభూషణం 'మద్యం బాటిళ్ల'ను లంచంగా అడగడం కేవలం వ్యక్తిగత అవినీతి మాత్రమే కాదు.. అది పోలీస్ వ్యవస్థలో క్రమశిక్షణ ఏ స్థాయిలో దిగజారిందో చెప్పేందుకు ఉదాహరణ. మానవ హక్కుల కమిషన్, హైకోర్టు వంటి అత్యున్నత సంస్థలు పోలీసుల తీరును తప్పుబట్టడం అనేది ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం.

**- తెలంగాణ సమాజంలో మారుతున్న ధోరణులు..**

పెరుగుతున్న కులాంతర వివాహాలు..! కాగితాలకే పరిమితమా గతంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే నినాదం బాగా వినిపించేది. కానీ క్షేత్ర స్థాయిలో సామాన్యుడికి ఆ అనుభూతి కలగడం లేదు. బాధితులు ఫిర్యాదు చేయడానికి వెళ్తే వారిని గంటల తరబడి నిరీక్షించమనడం, దురుసుగా మాట్లాడడం, చిన్న చిన్న పనులకు కూడా ఆశపడటం వంటివి పోలీసుల పట్ల భయాన్ని పెంచుతున్నాయే తప్ప భరోసాను ఇవ్వడం లేదు. రేవంత్ రెడ్డి పాలనలో తనదైన ముద్ర వేయాలని చూస్తున్నా, పోలీసుల పనితీరు ఆ వేగానికి అడ్డుకట్ట వేసేలా ఉంది.

**- వైసీపీ మద్దతు, కానీ షరతులు వర్తిస్తాయంటూ మెలిక! వరుస వివాదాలు..**

సస్పెన్షన్ల పర్వం కేవలం అవినీతి మాత్రమే కాదు.., గంజాయి స్మగ్లింగ్‌లో సహకరించడం, వివాహేతర సంబంధాల గొడవలు, సివిల్ సెటిల్మెంట్లలో తలదూర్చడం వంటి ఆరోపణలతో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పోలీసులు సస్పెన్షన్‌కు గురవుతున్నారు. పోలీసులే నేరస్తులకు సహకరిస్తున్నారన్న వార్తలు ప్రజల్లో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయి. హైకోర్టు వ్యాఖ్యానించినట్లు.. సామాన్య పౌరుడు స్టేషన్‌కు వెళ్లడానికి భయపడే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికే గండం.

**- ఐ లవ్ లోకేశ్.. రఘురామ ఆసక్తికర వ్యాఖ్యలు ముఖ్యమంత్రి సమీక్ష**

- వేరే నేతకు బాధ్యతలా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక శాఖలను పర్యవేక్షిస్తూ బిజీగా ఉన్నారు. ఇలాంటి సమయంలో హోం శాఖపై నిరంతర నిఘా ఉంచడం ఆయనకు సవాలుగా మారవచ్చు. అందుకే విశ్లేషకులు రెండు సూచనలు చేస్తున్నారు. వారానికి కనీసం ఒకసారి హోం శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, కింది స్థాయి సిబ్బంది వరకు జవాబుదారీతనాన్ని పెంచడం. ఒక పూర్తిస్థాయి హోం మంత్రిని నియమించడం ద్వారా శాఖపై పట్టు సాధించి, తప్పు చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకునేలా చూడటం. వ్యవస్థలో మార్పు అవసరం ప్రభుత్వం అమలు చేసే ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల వల్ల వచ్చే పాజిటివ్ ఇమేజ్‌ను ఒక ఎస్‌ఐ లేదా కానిస్టేబుల్ చేసే తప్పు క్షణాల్లో తుడిచిపెట్టగలదు. పోలీసులు బాధితుల పట్ల కరుణతో, నేరస్థుల పట్ల కఠినంగా ఉండాలి కానీ.. అందుకు భిన్నంగా జరిగితే అది ప్రభుత్వానికి మచ్చగానే మిగిలిపోతుంది. ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో, వారి రక్షణ కూడా అంతే ముఖ్యం. రేవంత్ రెడ్డి తక్షణమే పోలీస్ వ్యవస్థలో ప్రక్షాళన మొదలుపెట్టాల్సిన అవసరం ఉంది. 'తప్పు చేస్తే సొంత పార్టీ వారైనా, పోలీసులైనా సరే వదిలేది లేదు' అన్న సంకేతం గట్టిగా వెళ్తేనే వ్యవస్థ మారుతుంది. లేకపోతే, ఈ శాంతిభద్రతల సమస్యే భవిష్యత్తులో ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారవచ్చు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు పై పార్లమెంట్ లో దుమ్ము లేపిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్పీచ్

**మహిళా రిజర్వేషన్ బిల్లుకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు**

**- భారత దేశంలోని మహిళా స్వయం సహకార సంఘాలలో ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువ**

**- దివంగత ఎన్ టీ ఆర్, సీఎం నారా చంద్రబాబు మహిళలకు ఇచ్చిన గొప్పదనాన్ని పార్లమెంట్ లో వినిపించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: మహిళా రిజర్వేషన్ బిల్లు పై పార్లమెంట్ లో గురువారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ప్రసంగం అదుర్స్ అనిపించింది. తెలుగుదేశం పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని, భారత దేశంలోని మహిళా స్వయం సహకార సంఘాలలో ఎక్కువ ఆంధ్రప్రదేశ్ లోనే ఉన్నాయని అన్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ లో వివరిస్తూ, టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు పెద్దపీట వేసి అధికారంలో, రాజకీయ భాగస్వాములుగా చేసి మహిళలు దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మహిళా రిజర్వేషన్ బిల్లుపై 13 నిముషాల ప్రసంగం ఇలా ఉంది. సార్ నేను తెలుగుదేశం పార్టీ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నాను, మా సరస్వతి జ్ఞానం, మా లక్ష్మి సమృద్ధి. ఈ రోజు ఈ బిల్లుతో మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన మహిళల్లో ప్రతి దేవతను మేల్కొలిపారు, అంతేకాకుండా దేశానికి నాయకత్వం వహించడానికి స్వేచ్ఛను ఇచ్చారు, అది కూడా నిజమైన, చాలా అర్థవంతమైన మార్గంలో. మా తెలుగుదేశం పార్టీ పుట్టుక చాలా కీలక సమయంలో ఉంది. పేదరికం, అవినీతి కూడా అత్యున్నత స్థాయిలో ఉన్న సమయం, మూడున్నర దశాబ్దాల దుష్పరిపాలన, దీని తరువాత కేంద్రంలో, రాష్ట్రాలలో తన గొంతును వినిపించిన టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు మాత్రమే. దీని తరువాత మొదటి ప్రసంగం, రాజకీయ ప్రసంగంలో ఒక మహిళా ప్రధాని పాలించే దేశంలో మహిళలు సురక్షితంగా లేకపోవడం అవమానం కాదా అని చెప్పారు? మహిళా నేతృత్వ అభివృద్ధి దృష్టి. ఇది తెలుగుదేశం పార్టీ యొక్క వారసత్వం, ఒక పార్టీ. ఇది సోదరీమణులు, మహిళలను ఎల్లప్పుడూ గౌరవించే పార్టీటీడీపీ నే, ఈ మహిళా రిజర్వేషన్ బిల్ యొక్క దృష్టితో కూటమి. అది సాధారణమైన దానిని నారాయణగా మారుస్తుంది. నందమూరి తారక రామారావు 1980 ల ప్రారంభంలో తీసుకువచ్చిన సంస్కరణలు ఇప్పుడు జాతీయ విధానానికి నమూనాలుగా ఉన్నాయి. చూడండి, ఇది దశాబ్దాలుగా రోజులుగా జరుగుతోంది. ఒక చరిత్ర. బిసి రిజర్వేషన్, 30 శాతం మహిళా రిజర్వేషన్ ను ప్రకటించిన మొదటి పార్టీ టీడీపీనే. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా. మహిళలను విముక్తి చేసింది, వారికి స్వేచ్ఛను ఇచ్చింది, మన సమాజంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఇచ్చింది. తెలుగుదేశం పార్టీనే. హిందూ వారసత్వ చట్టం 1956 ప్రకారం ప్రతి మహిళకు పితృ ఆస్తిలో సమాన హక్కులు ఉన్నాయి. 1980 లలో జరిగిన చాలా ముఖ్యమైన పరిపాలనా నిర్ణయాలలో ఒకటి కేటాయించిన భూమి చట్టం, ఇక్కడ ప్రభుత్వం కేటాయించిన భూమి అంతా. ఇది యజమాన్య హక్కులను ప్రోత్సహించింది.

ఇది వారికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కూడా ప్రోత్సహించింది, అలాగే గృహ హింస కూడా తగ్గింది. స్త్రీలు విద్యను అభ్యసించాలని, ఉన్నత విద్యను అభ్యసించాలని కోరుకున్న రోజులు అవి, కానీ అప్పుడు వారిని ఎగతాళి చేశారు. పెళ్లి చేసుకోమని పిల్లల్ని కనమని అడిగారు. తిరుపతిలో మొదటి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించినది ఎన్టీఆర్ రావు. శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం. ఇక్కడ మహిళలు తమ కాళ్ళ మీద నిలబడవచ్చు అన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన గౌరవం, గొప్పదన్నాన్ని పార్లమెంట్ వేదిక ద్వారా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రపంచానికి చాటి చెప్పారు.

# దళపతికి ఈసీ షాక్..
# ఒకే రోజు మూడు ఎదురుదెబ్బలు!

**తమిళనాడు ఎన్నికల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మారిన టీవీకే పార్టీ అధినేత, దళపతి విజయ్ కి వరుస షాక్ లు తగులుతున్నాయి.**



తమిళనాడు ఎన్నికల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మారిన టీవీకే పార్టీ అధినేత, దళపతి విజయ్ కి వరుస షాక్ లు తగులుతున్నాయి. ఎన్నికల నిబంధనలపై సరైన అవగాహన లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో విజయ్ పై ఎన్నికల కమిషన్ సీరియస్ అవుతోంది. విజయ్ తోపాటు ఆయన పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు నియమావళిని అతిక్రమించేలా ఉన్నాయని ప్రత్యర్థులు ఫిర్యాదులు చేయడంతో ఒకే రోజు మూడు కేసులు నమోదు చేసేలా ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామం తమిళనాడులో తీవ్ర కలకలానికి కారణమవుతోంది.

**- బీటక్ రవి ఇలా అయితే కష్టమే బాసు..**

ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహణ, ట్రాఫిక్ కు అంతరాయం కల్పించారనే కారణాలతో విజయ్ పై మూడు వేర్వేరు పోలీసుస్టేషన్లలో గురువారం కేసులు నమోదు అయ్యాయి. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు చేయడంతో వెస్ట్ మాంబలం, సుంగంబాక్కం, వేపేరి పోలీసు స్టేషన్లలో టీవీకే అధినేత విజయ్ తోపాటు ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. వెస్ట్ మాంబలంలో సభ నిర్వహణకు అనుమతి తీసుకున్న విజయ్, అనుమతి లేకుండా భారీ రోడ్ షో నిర్వహించారని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సంతోష్ కుమార్ ఫిర్యాదు చేశారు.

**- తెలంగాణ సమాజంలో మారుతున్న ధోరణులు..**

పెరుగుతున్న కులాంతర వివాహాలు..! దీంతో విజయ్, టీ.నగర్ టీవీకే అభ్యర్థి ఎన్.ఆనంద్ పై బీఎన్ఎస్ సెక్షన్ 223 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదేవిధంగా సుంగం బాక్కంలో వల్లువర్ కొట్టం వద్ద ఎటువంటి అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహించారని, జనాలను భారీగా సమీకరించారని విజయ్, జేసీటీ ప్రభాకరన్ పై మరో కేసు నమోదు చేశారు. వేపేరిలో ఎన్నికల మార్గదర్శకాలను గాలికొదిలేసి ఎగ్మోర్ అభ్యర్థి రాజ్‌మోహన్‌తో కలిసి ప్రచారం చేసినందుకు మరో కేసు నమోదైంది. ఇక వేపేరిలో ఎన్నికల నియమావళిని అతిక్రమించి ఎగ్మోర్ టీవీకే అభ్యర్థి రాజ్ మోహన్ తో కలిసి ప్రచారం చేశారని ఇంకో కేసు పెట్టారు.

**వైసీపీ మద్దతు, కానీ షరతులు వర్తిస్తాయంటూ మెలిక!**

ఇలా మొత్తం విజయ్ పై ఒకే రోజు మూడు చోట్ల కేసులు నమోదయ్యాయి. మరోవైపు సినీ గ్లామర్ తో విజయ్ ఎక్కడికి వెళ్లినా జనం ఎగబడి వస్తున్నారు. దీంతో జనాలను నియంత్రించడం పోలీసులకు సవాల్ గా మారింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా జనాలను సమీకరిస్తున్నారని, రోడ్ షో షరతులను పాటించడం లేదని పోలీసు అధికారులు విజయ్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, విజయ్ టార్గెట్ గా వరుసగా నమోదు అవుతున్న కేసులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం, అధికార పార్టీ ఉద్దేశపూర్వకంగా విజయ్ పై కేసులు బనాయిస్తోందని టీవీకే కార్యకర్తలు ధ్వజమెత్తుతున్నారు.

## 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' పైనే నా తొలి సంతకం



చెన్నై : ఏప్రిల్ 23న తమిళనాడు పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడ డిఎంకె, ఎన్‌డిఎ కూటముల మధ్య ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. బుధవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, డిఎంకె చీఫ్ ఎం.కె స్టాలిన్ సేలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన డిఎంకె ప్రభుత్వం చేపట్టిన మహిళా సంక్షేమ పథకాల గురించి చెప్పారు. 'నేను సంతకం చేసిన మొదటి ఫైల్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించినది. ప్రతి మహిళా ప్రయోజనాలను పొందాలని నేను కోరుకుంటున్నాను. మహిళలకు ప్రయోజనం చేకూర్చే మొత్తం ఎంతైనా సరే.. నేను మహిళల సంక్షేమం కోసం అది చేస్తాను' అని అన్నారు. మహిళా సిధికారత, వారి సామాజిక– ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచే పథకాల అమలుపై డిఎంకె ప్రభుత్వం దృష్టి సారించిందని స్టాలిన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, ఈ ఎన్నికల ప్రచారంలో డిఎంకెతోపాటు కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్‌ఎం), కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన దేశీయ ముర్పోక్కు ద్రావిడ కజగం పార్టీల నేతలు కూడా పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ కాపీలను దగ్ధం చేసిన స్టాలిన్



చెన్నై : డీలిమిటేషన్ కి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నిరసన వ్యక్తం చేశారు. గురువారం నామక్కల్ లో నల్లజెండాను ఎగరవేసిన అనంతరం డీలిమిటేషన్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. " ఈ నిరసన బిజెపి ప్రభుత్వాన్ని కూలదోస్తుంది. ప్రతిఘటన జ్వాల తమిళనాడు అంతటా వ్యాపించనివ్వండి. ఇది పచ్చి మితవాద బిజెపి అహంకారాన్ని కూలదోయాలి" అని మండిపడ్డారు. 1950,1960ల్లో చేపట్టిన హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని గుర్తు చేశారు. డీలిమిటేషన్ నిరసనను హిందీ వ్యతిరేక ఉద్యమంతో పోల్చారు. "అప్పుడు తమిళనాడుపై హిందీని రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ చెలరేగిన ప్రతిఘటన జ్వాల ఢిల్లీని దహించి వేసింది. తమిళనాడు నిరసనలకు ఢిల్లీ తలొగ్గింది. ఇప్పుడు సొంతగడ్డపైనే తమిళులను శరణార్థులుగా మార్చాలని చూస్తున్న నల్లచట్టం ప్రతులను తగలబెట్టి ఆ జ్వాలను మళ్లీ రగిలించాలి. ఈ జ్వాల ద్రవిడ భూమి అంతటా వ్యాపించి, బిజెపి అహంకారాన్ని మోకరింపచేస్తుంది" అని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా తగ్గించనున్న డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేయాలని స్టాలిన్ ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. మూడురోజుల పాటు నివాసాల్లో, వాణిజ్య సంస్థల్లో నల్ల జెండాలు ఎగరవేయాలని కోరారు. డీలిమిటేషన్ బిల్లును ఆమోదించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కఠిన హెచ్చరిక నేపథ్యంలో ఈ నిరసనకు పిలుపునిచ్చారు.

## 'నారీ శక్తి' ప్రతి రంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తోంది
### – డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్




అమరావతి : భారతదేశ గతిని మారుస్తున్న 'నారీ శక్తి' ప్రతి రంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తోందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా .... పవన్ గురువారం ట్వీట్ చేశారు. చదరంగం గతుల్ని మార్చి చరిత్ర సృష్టించిన ఆర్.వైశాలీ విజయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఫిడే ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ ఛాంపియన్‌షిప్ బరిలో నిలిచిన తొలి భారతీయ మహిళగా వైశాలి నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల్లోనే కాకుండా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాలన, రీతూ కరిధాల్ శాస్త్ర సాంకేతికత, పివి.సింధు, మీరాబాయి చాను, నిఖత్ జరీన్ వంటి వారు ఒలింపిక్ వేదికలపై భారత్ గర్వపడేలా చేస్తున్నారని పవన్ కల్యాణ్ ప్రశంసింశారు. ఈ సాధికారత వెనుక రాజ్యాంగ నిర్మాతలు దక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్ ముఖ్ వంటి మహనీయుల కృషి ఉందని పవన్ గుర్తుచేశారు. వారి పునాదుల వల్లే నేడు మహిళలకు సమానత్వం, గౌరవం లభిస్తున్నాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నారీ శక్తి వందన్ అధినియం–2026' బిల్లు.. శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారి భాగస్వామ్యాన్ని సుస్థిరం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ 2019 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, మహిళా సాధికారత తమకు కేవలం నినాదం కాదని, ఒక నిబద్ధత అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుందనే సిద్ధాంతాన్ని తాను బలంగా నమ్ముతానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం అనేది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదని, వారికి దక్కాల్సిన గౌరవాన్ని తిరిగి ఇవ్వడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బలమైన మహిళలతో బలమైన కుటుంబాలు, తద్వారా పటిష్టమైన దేశం నిర్మితమవుతుందని పవన్ అన్నారు. ఇకపై నారీ శక్తి అనేది కేవలం ఒక నినాదంగా కాకుండా, భారత నాగరికతకే ఒక బలమైన శక్తిగా నిలుస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## ఈ రోజు మన గౌరవం మీద దాడి జరిగింది: పొన్నం




హైదరాబాద్: పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడిన మాటలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ తేజస్వి సూర్య పార్లమెంట్‌లో నిలబడి మాట్లాడటం మన గౌరవం మీద దాడి జరిగినట్లేనని పొన్నం ధ్వజమెత్తారు. ఈ మేరకు గాంధీభవన్ నుంచి ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'ఇది మాట కాదు. ఇది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం. ఇది మన పోరాటంపై దాడి. ఇది మన ఆత్మగౌరనానికి అయిన గాయం. మనకు తెలంగాణ ఎలా వచ్చింది?, రక్తంతో కాదు... రాజ్యాంగంతో వచ్చింది. హింసతో కాదు... ప్రజాస్వామ్యంతో వచ్చింది. అలాంటి పవిత్రమైన ఉద్యమాన్ని...దేశ విభజనతో పోల్చే హక్కు ఎవరికీ లేదు' అని హెచ్చరించారు. పార్లమెంట్ అంటేనే గౌరవం ఉండాలి. అది చౌకబారు రాజకీయాల వేదిక కాదు. ఈ వేదిక నుండి నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆ వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డ్స్ నుండి తొలగించాలి. ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఇది పార్లమెంటరీ నియమావళి ఉల్లంఘనగా పరిగణించాలి. అవసరమైతే సభ్యత్వంపై కూడా చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు పొన్నం. తెలంగాణను అవమానిస్తుంటే రాష్ట్ర నుంచి కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. తెలంగాణను కించపరిచే వారికి తగిన బుద్ధి చెప్పాలని పొన్నం పేర్కొన్నారు.

# హద్దులెరుగని జ్ఞానం




'మాకు గోడలు లేవు, గోడలు పడగొట్టడమే మా పని' అంటాడు శ్రీశ్రీ. మానవ జీవనప్రస్థానం గోడలు లేని దశ నుంచి గోడలు కట్టుకునే దశకు చేరుకుని ప్రస్తుతానికి అక్కడే స్థిరపడింది. గోడలు లేని దశ గురించిన స్పృహ మనిషిలో అంతరించి గోడలు కట్టుకోవడమే స్వాభావికమూ, స్థిరమూ, సత్యమనే భావన బలపడింది. గోడలు కట్టుకో వడం రకరకాల రూపాలలో జరుగుతుంది. వర్ణం, కులం, ప్రాంతం, దేశం, భాష మొదలైనవి కొన్ని మాత్రమే! దేశాల విషయానికి వస్తే, గోడలను సరిహద్దుల పేరుతో పిలుచుకుంటాం. కానీ, ప్రకృతినే గమనిస్తే, సరిహద్దులు లేనిదే ప్రకృతి అనీ, సరిహద్దులు గీసు కోవడం వికృతి అనీ ఇట్టే బోధపడుతుంది. భూమి, నీరు, వెలుగు, గాలి, ఆకాశమనే పంచ భూతాలు సరిహద్దులనెరుగవు; ఎక్కడి నుంచి ఎక్కడికైనా నిరాఘాటంగా వ్యాపిస్తాయి. మొదట్లో మనిషి కూడా అలా వ్యాపించినవాడే. కాలగతిలో సరిహద్దులు నిర్మించు కోవడానికి అలవాటుపడ్డాడు. ఆ విధంగా సరిహద్దులు లేని దశ నుంచి సరిహద్దుల దశకు చేరుకోవడం మనిషి భౌతిక, బౌద్ధిక వికాసంలో మెరుపులీనే మైలురాయి కావడం విచిత్రం; అదే అతని చరిత్రలో ఒక విరోధాభాస. అదే సమయంలో, తన మేధనూ, మేధాగతమైన జ్ఞానాన్నీ సరిహద్దులను దాటించి పరస్పరం పంచుకున్న, పంచుకుంటున్న అనుభవమూ మనిషికి ఉంది. అయినాసరే, తనే కల్పించుకున్న కృత్రిమ సరి హద్దులే నిజమని నమ్మి ఆ ఇరుకులో కూరుకుపోవడమే అతనిలోని వైరుధ్యం. 'జ్ఞాన'మనే మాటనే తీసుకోండి. తెలుగులో ఎరుక, తెలివి, తెలివిడి మొదలైన పర్యాయపదాలు ఉన్నప్పటికీ, వాటికన్నా ఎక్కువగా జ్ఞానమనే మాటే ప్రాచుర్యంలోకి వచ్చింది. నిజానికి ఈ మాట నేటి మనదేశపు సరిహద్దులకు బయట ఆరువేల సంవత్స రాల క్రితం మాట్లాడిన ప్రోటో––ఇండో యూరోపియన్ భాష నుంచి పుట్టింది. వ్యుత్పత్తి పదనిఘంటువు ప్రకారం, 'తెలుసుకోవడ'మనే అర్థమిచ్చే 'గ్నో' అనే ప్రోటో––ఇండో యూరోపియన్ మూలపదం నుంచి 'టు నో', 'నాలెడ్జ్', 'ఎకనాలెడ్జ్', 'కాగ్నిషన్', 'డయో గ్నొసిస్', 'ఇగ్నొరెంట్', 'ఇగ్నోర్', 'నొబిలిటీ' వంటి మాటలు రూపొందాయి. ఇదే సంస్కృతంలో 'జ్ఞ'గా మారి 'జ్ఞాన'మనే మాటను పుట్టించింది. పర్షియన్ల అవెస్తాలో జ్ఞానమనే అర్థంలో 'జయింతి'గా, ఓల్డ్ చర్చి స్లావోనిక్‌లో గుర్తించడమనే అర్థంలో 'జ్ఞన్టి'గా, తెలుసుకోవడమనే అర్థంలో రష్యన్‌లో 'నాట్'గా, గ్రీకులో 'నాత్స్'గా, తెలిసినదనే అర్థంలో ఐరిష్‌లో 'గనాత్'గా మారింది. అలాగే, అతి ప్రాచీనకాలం నుంచీ, ఆధునిక కాలం వరకూ జ్ఞానప్రసారం కూడా అన్ని రకాల సరిహద్దులనూ దాటి జరుగుతూనే ఉంది. మనదేశానికి సంబంధించే చెప్పు కుంటే, సున్నాను, జ్యోతిశ్శాస్త్రాన్ని ఇచ్చిన ఆర్యభట్టు; శస్త్రచికిత్సలో మార్గదర్శి అయిన సుశ్రుతుడు, రామన్ ఎఫెక్ట్ ద్వారా ప్రసిద్ధుడైన సీవీ రామన్ మొదలుకొని –– ప్రాచీన గ్రీసుకు చెంది, తర్కాన్ని, శాస్త్రవిజ్ఞానాన్ని ఇచ్చిన అరిస్టాటిల్; క్షేత్రగణితాన్ని ఇచ్చిన పైథాగరస్; వైద్యశాస్త్రాన్ని ఇచ్చిన హిపోక్రటెస్ –– యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెంది, గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని, కలన గణితా(కేల్క్యులస్)న్ని ఇచ్చిన న్యూటన్, పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన చాల్స్ డార్విన్, కంప్యూటింగ్‌ను ఇచ్చిన అలాన్ ట్యూరింగ్–– జర్మనీకి చెంది, సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, క్వాంటమ్ సిద్ధాంతాన్ని ఇచ్చిన మాక్స్ ప్లాంక్ వరకూ, సరిహద్దులకు అతీతంగా యావత్ప్రపంచ దీప స్తంభాలుగా నిలిచి జ్ఞానకాంతిని విశ్వవ్యాప్తం చేసిన మేధాభాస్కరులు ఎందరెందరో! అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ఫలితాలు, పరికరాలతో సహా అన్ని రంగాలలో అన్ని దేశాలవారూ ప్రసాదించిన జ్ఞానభిక్షను అందుకుంటూ, పంచుకుంటూ జీవితాన్ని అన్నివిధాలా తేజోవంతం చేసుకుంటూనే; అనేకానేక సరిహద్దుల సంకెళ్ళతో తనను తాను బంధించుకుంటూ సరిహద్దులెరుగని ప్రాపంచిక జ్ఞానానుభవాన్ని గుర్తించలేక పోవడమూ మనిషికే చెల్లింది. ప్రకృతి మరే జీవజాలానికీ ఇవ్వని వరాలను మనిషి కిచ్చింది; కానీ వాటికి తనవైన శాపాలను జోడించుకుంటూ జీవితాన్ని ముళ్ళకంపగా మార్చుకునే అవివేకతలో కూడా మనిషికి మరే జీవీ సాటిరాదు. ప్రకృతి గీసిన హద్దుల్లో జీవించడమే తప్ప స్వయంగా హద్దులు గీసుకోవడం చేతకాని జీవులే మనిషి కన్నా సుఖంగా జీవిస్తున్నాయనిపిస్తుంది. సరిహద్దులెరుగని వసుధైక భావన దిశగా మనిషి పునఃప్రస్థానం ఇంకా ఎప్పటికి?!

# మణిపూర్‌లో మళ్లీ అశాంతి



నివురు గప్పిన నిప్పులా ఉన్న మణిపూర్‌లో మళ్లీ అశాంతి, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటం ఆందోళనకరం. గత మంగళవారం బిష్ణుపూర్ జిల్లాలోని అవాంగ్ లైకై గ్రామంలో దుండగులు ఒక ఇంటిపై బాంబు దాడి చేయగా, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే బిష్ణుపూర్ జిల్లాలో వేలాదిమంది రోడ్ల మీదికి వచ్చి, ఆందోళనలకు దిగారు. చురాచాందపూర్ వైపు వెళుతున్న రెండు ఆయిల్ ట్యాంకర్లకు, ఒక ట్రక్కుకు నిప్పంటించారు. ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేసి, రహదారులను స్తంభింపచేశారు. ఆ రహదారిలోనే ఉన్న సిఆర్‌పిఎఫ్ క్యాంపును వేలాదిమంది చుట్టుముట్టారు. వారిని అదుపు చేసే పేరుతో పోలీసులు జరిపిన కాల్పులు ఇద్దరిని బలిగొన్నాయి. 19 మంది ఆందోళనకారులు గాయపడ్డానికి కారణమయ్యాయి. ఈ సంఘటన తరువాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మరో నాలుగైదు జిల్లాల్లో జనం భారీఎత్తున రోడ్ల మీదికి వచ్చి, ఆందోళన చేపట్టారు. భద్రతా దళాలు మోహరించి ఉన్నప్పటికీ ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితులను అదుపుచేయటానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ ప్రకటించింది. నిరసనలు చెలరేగిన ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. పోలీసు బలగాలను మోహరించింది. ఒక ఇంటిపై జరిగిన బాంబు దాడి ఇంతటి తీవ్ర నిరసనకు, ఉద్రిక్తతకు దారి తీయటానికి ఆ రాష్ట్రంలోని నెలకొని ఉన్న అభద్ర వాతావరణమే కారణం. మైదాన ప్రాంతంలో నివసించే మైతీయులకు గిరిజన తెగ గుర్తింపు ఇవ్వొచ్చని 2023లో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో కొండలపై నివసించే కుకీ తెగ ప్రజలు కలత చెందారు. తమ హక్కులకు భంగం కలుగుతుందని, తమ భూములకు రక్షణ లేకుండా పోతుందని నిరసనలు తెలిపారు. ఇది మైతీయులకు ఆగ్రహం కలిగించింది. రెండు తెగల మధ్య చాలా కాలంగా ఉన్న విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. కుకీ గ్రామాలపై మూకుమ్మడి దాడులు, దహనకాండ, తరిమివేత, హత్యలు, అత్యాచారాలూ అడ్డూ అదుపూ లేకుండా సాగాయి. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ దుర్మార్గ కాండను చూస్తూ ఉండిపోయింది తప్ప– ఆపటానికి ప్రయత్నం చేయలేదు. ఆ ఏడాది మే 3న ఇద్దరు కుకీ మహిళలను నగంగా ఊరేగించిన అమానవీయ సంఘటన ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. మైతీయులు మెజార్టీగా ఉన్న ప్రాంతాల్లో కుకీలను వెంటాడి తరమటం, బాధితులు సహాయం కోరినా ప్రభుత్వం పట్టనట్టు ఉండిపోవటం ... చాలా విమర్శలకు దారి తీసింది. ఈ దుర్మార్గాల గురించి వీడియోలు వెల్లడయ్యాక కానీ, ఆ రాష్ట్రంలో ఏం జరిగిందో బయటి ప్రపంచానికి తెలియలేదు. సభ్య సమాజం నివ్వెరపోయి, ఇది చాలా దారుణమని నిరసిస్తే– ఇవి చాలా సాధారణ సంఘటనలే అన్నట్టుగా అప్పటి బిజెపి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ వ్యాఖ్యానించి, అభాసు పాలయ్యారు. ఇంత జరిగినా ప్రధాని మోడీ వెంటనే స్పందించలేదు. మణిపూర్‌ని సందర్శించలేదు. కుకీలు క్రైస్తవాన్ని అనుసరించటమే బిజెపి పాలకుల పట్టనితనానికి ఒక కారణమనే విమర్శలు వచ్చాయి. ఆ తరువాత కూడా మణిపూర్ మంటలను ఆర్పటానికి, బాధితులకు బాసటగా నిలవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోలేదు. దీంతో, ఆ రెండు తెగల మధ్య నెలకొన్న విభేదాలు సమసిపోలేదు. తరచూ ఏదో ఒక చోట దాడి, ఆస్తి దహనం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మత చిచ్చుతో లబ్ధి పొందాలని సంఘ పరివార శక్తులు, కొండ ప్రాంతాల్లోని ఖనిజాలను కొల్లగొట్టాలని కార్పొరేట్ శక్తులూ మణిపూర్ మంటలకు ఆజ్యం పోస్తున్నాయి. మూడేళ్ల క్రితం దాదాపు ఐదు వేల గ్రామాలు ద్వేషాగ్నికి ఆహుతై పోగా, జనం చెల్లాచెదురై పోయారు. ఇళ్ళను, ఆస్తులను కోల్పోయిన వేలాదిమంది శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఇంకొందరు రాష్ట్రం విడిచి, వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్ది, శాంతి సామరస్యాలను, సహ జీవన సంస్క ృతిని నెలకొల్పాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది. నిర్వాసితులైన వారికి నీడ కల్పించాలి. మనుషుల మధ్య విభజన రేఖలు గీసి, విద్వేషాలకు, విధ్వంసాలకు కారణమవుతున్న ఉన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలి. భద్రతా దళాల మోహరింపుతోనే శాంతి చేకూరదు. విద్వేషాలకు కారణమైన పరిస్థితులను చిత్తశుద్ధితో చక్కదిద్దాలి. లేకుంటే మళ్లీ ఏదో ఒక రూపంలో ఉద్రిక్తతలు తలెత్తుతూనే ఉంటాయి.

# మోసపూరితం




చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని సవరించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఏర్పాటు చేయడం కమలనాథుల కపట నీతికి నిదర్శనం. ఉభయ సభల సభ్యులు ఎన్నికల్లో తలమునకలైవున్న సందర్భంలోనే ఈ ప్రత్యేక సమావేశం జరపాలనడం సర్కారుకు ఆ రిజర్వేషన్లపట్ల చిత్తశుద్ధి వున్నట్టు కాదు. నిజంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 ఎన్నికల్లోనే అమలు చేయాలని నరేంద్ర మోడీ సర్కారు అభిమతమైతే ఆ బిల్లు ఆమోదించిన 2023 సెప్టెంబర్ లోనే ఆ పని చేసివుండవచ్చు. కానీ అప్పుడు తాజా జనాభా లెక్కల ప్రాతిపదికపై డీలిమిటేషన్ జరిపాకనే కొత్త చట్టం అమలు చేస్తామని చెప్పినది ఈ పాలకులే కదా! చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆనాడు ప్రతిపక్షాలు పట్టుబట్టినా పాలక పార్టీ అందుకు తిరస్కరించింది కదా! అంతేగాక ఆనాడు జనగణన, డీలిమిటేషన్ గురించి అంత గట్టిగా చెప్పినవారు ఇప్పటివరకు ఆ పని పూర్తి చేయనేలేదు. దాదాపు మూడేళ్లవుతున్నా డీలిమిటేషన్ కమిషన్ ను నియమించలేదు. జనగణన పూర్తి స్థాయిలో ప్రారంభమే కాలేదు. అవేమీ చేయకుండా ఇప్పుడు పార్లమెంటు ప్రత్యేక సమావేశం అంటున్నారంటే హఠాత్తుగా వారికేమైనా బోధివృక్షం కింద జ్ఞానోదయం జరిగిందా! ఏతావాతా పరిశీలిస్తే జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలక ఎన్‌డిఎ, దాని మిత్రులు రాజకీయ లబ్ధి పొందడం కోసమే ఇదంతా చేస్తున్నారని స్పష్టమవుతోంది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారంనాడు లేఖ రాయడం మరో విచిత్రం! 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో నిర్వహించడం అనివార్యమని లేఖలో ప్రధాని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు వివరించారు. 'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరూ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది.' అని మోడీ లేఖలో పేర్కొనడం సరే! కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని ప్రస్తావించినా అది నిజం కాదని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో ప్రతిపక్షాలకు అనేక అభ్యంతరాలున్నప్పటికీ బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో 2023లో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మరువరాదు. మహిళా రిజర్వేషన్ చట్ట అమలుకు సంబంధించిన విషయాలు చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ఆ పని చేయలేదు. మరోవైపున 2011 జనాభా ప్రకారం డీలిమిటేషన్ చేయాలనీ, నియోజకవర్గాల సంఖ్య పెంచాలనీ ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదనలను ముందుకు తేవడం అభ్యంతరకరం. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడించకుండా వాటిని ఏ ప్రాతిపదికన చేస్తారో వివరించకుండానే ఎకాయెకిన చట్ట సవరణకు పూనుకోవడం సర్కారుకు తగని పని. మహిళా రిజర్వేషన్ ప్రక్రియకు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అంశాలతో ముడిపెట్టకుండానే అమలు చేయాలి. ఎందుకంటే నియోజకవర్గాల పెంపు విషయంలో వివిధ రాష్ట్రాలకు అభ్యంతరాలుండడం సహజం. అంతేగాక జనాభా వృద్ధిరేటు విషయంలోనూ రాష్ట్రాల మధ్య చాలా తేడాలున్నాయి. ఇటువంటి అనేక చిక్కులు తలెత్తుతాయి. అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు మే నాలుగున వచ్చినా పోలింగ్ ప్రక్రియ ఏప్రిల్ 29తో ముగుస్తుంది. కాబట్టి ఆ తేదీ తరువాత ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని వివరాలు వెల్లడించి రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధించాలి. అలాగే రాష్ట్ర అసెంబ్లీల నియోజకవర్గాల విభజన, సంఖ్యను పెంచడం వంటి ప్రతిపాదనలున్నందున రాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదింపులు జరపాలి. విస్తృత చర్చల అనంతరం ఏకాభిప్రాయం ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా విశాల సమాజ హితం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి. అందుకు ప్రజా ఒత్తిడి అవసరం.

## తమ హక్కులకు వ్యతిరేకంగా నిలిచిన వారిని మహిళలు మర్చిపోలేదు : మోడీ




న్యూఢిల్లీ : తమ హక్కులకు వ్యతిరేకంగా నిలిచిన వారిని మహిళలు మర్చిపోలేదని ప్రధాని మోడీ అన్నారు. నేడుడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుపై ప్రధాని మోడీ మాట్లాడారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే ఈ బిల్లుని అమలు చేయాలని ఆయన గట్టిగా చెప్పారు. ఈ బిల్లును ఆమోదింపజేసుకునే ముఖ్యమైన అవకాశాన్ని ఎంపీలు చేజార్చుకోకూడదని ప్రధాని అన్నారు. ఈ బిల్లుపై సభలో మోడీ మాట్లాడుతూ.. ఈ ముఖ్యమైన బిల్లుపై చర్చ ఈ ఉదయం ప్రారంభమైంది. చాలా మంది సభ్యులు వివిధ సమస్యలను లేవనెత్తారు. మేము ఆ విషయాలపై సభకు సవివరమైన ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తాము. అందుకే నేను ఆ వివరాల్లోకి వెళ్లాలనుకోవడం లేదు. ఒక దేశ జీవితంలో కొన్ని ముఖ్యమైన ఘట్టాలు ఉంటాయి. అటువంటి సమయంలో సమాజపు ఆలోచనా విధానం, నాయకత్వపు సామర్థ్యం ఆ క్షణాన్ని అందిపుచ్చుకుని, దానిని దేశానికి ఒక ఆస్తిగా మార్చి, బలమైన వారసత్వాన్ని సృష్టిస్తాయి. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఇవి అలాంటి క్షణాలే అని ఆయన అన్నారు. 25-30 సంవత్సరాల క్రితం ఈ ఆలోచన మొదట వచ్చినప్పుడు, దాని అవసరాన్ని గుర్తించినప్పుడే మనం దానిని అమలు చేసి ఉండాల్సింది. ఈరోజు మనం దానిని గుర్తించడమే కాకుండా. ఒక పరిణతి చెందిన దశకు తీసుకువచ్చాము. అవసరాన్నిబట్టి దీనిని ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవచ్చు. ఇదే ప్రజాస్వామ్య గొప్పతనం. మనది ప్రజాస్వామ్యానికి తల్లి. మన ప్రజాస్వామ్యం వేల సంవత్సరాలుగా ఒక అభివృద్ధి ప్రయాణంగా సాగుతోంది. ఈ అభివృద్ధి ప్రయణానికి ఒక కొత్త కోణాన్ని జోడించే శుభప్రదమైన అవకాశం ఈ సభలోని మనందరికీ లభించింది. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం చేయాలని మోడీ ఎంపీలను కోరారు. ఈ బిల్లుని ఆమోదిస్తే దేశ రాజకీయాలకు రూపునివ్వడమే కాకుండా దేశ దిశను, పరిస్థితిని కూడా నిర్ధారిస్తుంది. దీనిపై సభ్యులు ఆందోళనలు వ్యక్తం చేశారని, పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, కొత్త రాజకీయ సంస్కృతిని రూపొందించడమే ఈ బిల్లుల లక్ష్యమని ఆయన అన్నారు. మేము దేశానికి ఒక కొత్త దిశను చూపిస్తున్నాము. మేము ఒక సానుకూల ప్రభావాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాము. ఇది రాజకీయ రంగంలో ఒక కొత్త దిశను నిర్దేశిస్తుంది. జనాభాలో సగభాగాన్ని విధాన రూపకల్పనలోకి తీసుకువచ్చే ఈ తరుణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. తమ హక్కులకు వ్యతిరేకంగా నిలిచిన వారిని మహిళలు మర్చిపోలేదు. వికసిత్ భారత్ విజన్ అంటే కేవలం రైలు, రోడ్డు లేదా మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. వికసిత్ భారత అంటే సబ్కా సాత్, సబ్కా వికాస్ అని అర్థం అని మోడీ అన్నారు.

## ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం వల్ల ప్రమాదకర పరిణామాలు సంభవిస్తాయి : అరాఘ్చి హెచ్చరిక



టెహ్రాన్ : పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం విధిస్తే.. ప్రమాదకరమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి అమెరికాను హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధితో సహా కీలక ప్రాంతీయ జలమార్గాల్లో అమెరికా దళాలు ఆధిపత్యాన్ని సాధించుకున్నాయని, ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని విజవంతంగా అమలు చేశామని బుధవారం యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అలాగే ఆపరేషన్ ప్రారంభించిన 36 గంటల్లోపే ఇరాన్‌లోకి ప్రవేశించే, బయటకు వెళ్లే అన్ని సముద్ర వాణిజ్య మార్గాల్ని అమెరికా దళాలు సమర్థవంతంగా నిలిపివేశాయని సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, జపాన్ విదేశాంగ మంత్రి ఇరాన్ విదేశాంగ మంత్రికి ఫోన్ చేసి ప్రస్తుత పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యితో అరాఘ్చి ఫోన్‌లో మాట్లాడారని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టిగ్ (ఐఆర్ఐబి) వెల్లడించింది. అలాగే కాల్పుల విరమణ తర్వాత ఈ ప్రాంతంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై అరాఘ్చి ఆందోళన వ్యక్తం చేశారు. పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించేలా అమెరికా చేస్తున్న రెచ్చగొట్టే వైఖరులు, చర్యల వల్ల ప్రమాదకరమైన పరిణామాలు సంభవిస్తాయని అరాఘ్చి హెచ్చరించారు. అమెరికా చర్యల వల్ల ఈ ప్రాంతంలోని పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని ఆయన అన్నారు. ఈ మేరకు తాజాగా విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. హోర్ముజ్ జలసంధిపై వాషింగ్టన్ ప్రతిపాదించిన తీర్మానం ఏకపక్షమైనదని అరాఘ్చి అభివర్ణించారు. భద్రతా మండలిలో అమెరికా వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు. అమెరికా మద్దతు గల తీర్మానాన్ని చైనా, రష్యాలు వ్యతిరేకించడాన్ని అరార్ఘ్చి ప్రశంసించారు. ఉద్రిక్తతలు పెరగకుండా నివారించడంలో వారి వైఖరి సమర్థవంతమైన పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నియంత్రించడానికి, దౌత్య ప్రయత్నాలకు బీజింగ్ సిద్ధంగా ఉందని అరాఘ్చి పునరుద్ఘాటించినట్లు ఐఆర్ఐబి నివేదిక పేర్కొంది. కాగా, బుధవారం జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగితో కూడా ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చి ఫోన్‌లో సంభాషించారు. ఇరువురు నేతలు ప్రాంతీయ పరిణామాలపైనా, ద్వైపాక్షిక సంబంధాలపైనా చర్చించుకున్నారు. పాకిస్తాన్‌లో జరిగిన శాతి చర్చలు విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై మరింత బెదిరింపు దిగాడు. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించి, ఇరాన్ పోర్టులకు వెళ్లే నౌకల్ని అమెరికా సైన్యం అడ్డుకుంది. అమెరికా- ఇజ్రాయిల్ చర్యల వల్ల రవాణాకు కలిగిన అంతరాయాలతో సహా, వాటి భద్రతా, ఆర్థిక పరిణామాలపై తోషిమిత్సు, అరాఘ్చి మాట్లాడుకున్నారని ఐర్ఐబి ప్రకటన వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితి మరింత క్లిష్టంగా మారకుండా నిరధించడానికి అన్ని ప్రభుత్వాలు బాధ్యతాయుతమైన వైఖరిని అవలంబించాల్సిన అవసరాన్ని అరాఘ్చి నొక్కి చెప్పినట్లు ఐఆర్ఐబి ప్రకటన తెలిపింది. అయితే ప్రస్తుత పరిస్థితిపై మోటేగి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, స్థిరత్వాన్ని నెలకొల్పడం కోసం జరుగుతున్న ప్రయత్నాలకు జపాన్ సహకరిస్తుందని ఆయన సుముఖత వ్యక్తం చేశారు.ం

## ఓటు హక్కుని వినియోగించుకోలేదని ఓటర్లను శిక్షించలేం



న్యూఢిల్లీ : తమ ఓటు హక్కుని వినియోగించుకోలేదని ఓటర్లను శిక్షించలేమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఎన్నికల రోజున పోలింగ్ బూత్ కు వెళ్లకూడదని నిర్ణయించుకున్నందుకు ఓటర్లను శిక్షించడం గాని అరెస్ట్ చేయడం గాని కుదరదని పేర్కొంది. ఓటర్లు తమహక్కుని స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఓటు వేయాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా ఓటరుదేనని స్పష్టం చేసింది. ఉదాహరణకు రోజువారీ కూలి లేదా ఇతర రాష్ట్రం నుండి వచ్చిన వలసదారులను తీసుకుంటే.. చర్యలు తీసుకుంటామని బెదిరించి, వారి రోజువారీ స్వల్ప ఆదాయాన్ని వదులుకుని మరీ ఓటు వేసేందుకు సొంత రాష్ట్రం వెల్లాలని వారిపై ఒత్తిడి తీసుకురాలేమని సిజెఐ పేర్కొన్నారు. ఓటు వేయలేదని ఆ పమయంలో వారిని అరెస్టు చేయమని ఆదేశించాలా అని ప్రశ్నించారు. చట్టబద్ధమైన పాలన, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే దేశంలో, అందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఆశిస్తారని, ఒక వేళ కుదరకపోతే వెళ్లరు అని అన్నారు. ఇందు కోసం ఓటు హక్కుపై అవగాహన కల్పించడం ఒక్కటే విరుగుడు అని, వారిపై ఒత్తిడి తీసుకురాలేమని అన్నారు. సంబంధిత అధికారులను లేదా భాగస్వామ్యులను సంప్రదించమని పిటిషనర్ ను ఆదేశించారు. ఓటు హక్కుని వినియోగించుకోని ఓటర్లను శిక్షించాలని, లేదా ఆంక్షలు విధించాలని కోరుతూ అజయ్ గోయల్ పిటిషన్ ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

# మితవాదులకు భంగపాటు!

స్వతంత్రంగా ఉండాల్సిన వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసి, పదహారేళ్లపాటు అప్రతిహతంగా అధికారాన్ని వెలగబెట్టిన పచ్చి మితవాది, ట్రంప్ అనుయాయి విక్టర్ ఓర్బన్‌ను హంగేరి ఓటర్లు చిత్తుగా ఓడించారు. మితవాదులకు నమూనాగా మారి, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా వరకూ అన్నింటినీ గుప్పెట్లో పెట్టుకుని, జాతీయవాద ఉన్మాదాన్ని రెచ్చగొట్టినా ఓటర్లు ఛీకొట్టారు. 199 స్థానాలున్న పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష టిస్జా పార్టీకి 138 స్థానాలు, ఓర్బన్ పార్టీ ఫిడెస్‌కు 55, తీవ్ర మితవాద పక్షం అవర్ హోం ల్యాండ్‌కు ఆరు స్థానాలు లభించాయి. జాతీయ సహకార వ్యవస్థ (ఎన్ఇఆర్) పేరుతో అనేక మార్పులు చేసి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలతో, అవినీతిని విశృంఖలం చేసిన ఫిడెస్ పార్టీకి ఈ ఫలితాలు చెంపపెట్టు. ఆర్థిక సంస్థలు, అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, అవినీతి నిరోధక విభాగం... ఇవన్నీ తన అనుయాయులతో ఓర్బన్ నింపేశాడు. మనదేశంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (ఎస్ఐఆర్) పేరుతో ఎన్నికల సంఘం ఓట్లను గల్లంతు చేస్తున్న రీతిలోనే అక్కడి ఎన్నికల సంఘం వ్యవహరించింది. ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన, చట్టాలను మార్చి ఎన్నికల నిబంధనలను అనుకూలంగా మార్చుకోవడం, మీడియాను నియంత్రించడం లాంటివన్నీ చేశారు. వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ (వి-డెమ్) సర్వేలో ఎన్నికల నిరంకుశత్వంలో మన దేశం కంటే ముందు హంగేరి ఉంది. ఇక ద్రవ్యోల్బణం చుక్కలనంటింది. ఎన్నడూ లేనివిధంగా గత ఏడాది ఆర్థిక వృద్ధి 0.4 శాతానికి దిగజారిపోయింది. నిరుద్యోగం వికటాట్టహాసం చేసింది. విద్య, వైద్యం అటకెక్కాయి. రెండేళ్ల క్రితమే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి టిస్జా పార్టీని స్థాపించిన పీటర్ మాగ్యార్ ఈ పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకున్నారు. ఓర్బన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికల్లో ఓటమి తప్పదని కొన్ని స్వతంత్ర సంస్థలు తేల్చిచెప్పినా...ప్రభుత్వ అనుకూల మీడియా మళ్లీ ఓర్బన్ ప్రభుత్వం భారీ మెజారిటీతో ఎన్నికవుతుందని ఊదరగొట్టింది. తాజా ఫలితాలు 'నిజమైన పరిస్థితి'కి అద్దం పట్టాయి. కోటి జనాభా ఉన్న ఈ చిన్న దేశంలో 80 శాతం పోలింగ్ జరగడం ఇదే తొలిసారి. ఓర్బన్ పచ్చి మితవాదులకు, కార్పొరేట్లకు అనుంగు మిత్రుడు, అమెరికా




అధ్యక్షుడు ట్రంప్ 'మాగా' (మేక్ అమెరికా గేట్ ఎగైన్) నినాదానికి ఓర్బన్ మోసాలే స్ఫూర్తి. ఇతనిని గెలిపిస్తే భారీ ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించడంతోపాటు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌ని ప్రచారం కోసం ట్రంప్ పంపించినా ఫలితం శూన్యం. ఇజ్రాయిల్ అధ్యక్షుడు, యుద్ధోన్మాది నెతన్యాహు కూడా ఇతనికి మద్దతు తెలిపారు. ఫ్రాన్స్ లీపెన్, ఇటలీ మెలోని, రష్యా పుతిన్ లాంటి వారు కూడా ఇతని మద్దతుదార్లే. సంప్రదాయ వాదాన్నీ, జాతీయవాదాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను విపరీతంగా రెచ్చగొట్టడంలో ఓర్బన్ దిట్ట. యూరోపియన్ యూనియన్ (ఇయు), కమ్యూనిస్టులు, వలసదారులు, విదేశీయులు.. అందరూ శత్రువులనీ... తాను మాత్రమే సమస్యలన్నింటినీ పరిష్కరించగలనన్న అతని మాటల గారడీని ఇన్నాళ్లూ నమ్మిన హంగేరీ ఓటర్లు... ఈ ఎన్నికల్లో తిప్పికొట్టారు. మూడింట రెండొంతుల మెజారిటీతో గెలుపొందిన మాగ్యార్ ముందు అనేక సవాళ్లున్నాయి. ఇన్నాళ్లూ అమలులో ఉన్న పచ్చి మితవాద, ప్రజావ్యతిరేక విధానాలను నిలువరించి ప్రజాస్వామిక వాదిగా, ప్రజలందరి బాగుకోరే పాలనను చేపడితేనే ప్రజా నాయకుడిగా మిగులుతారు. ఒకటిన్నర దశాబ్దాలుగా రాజ్యమేలుతున్న పచ్చి మితవాద భావజాలం గల పార్టీలను దూరం పెట్టే ఒరవడిని చాలా దేశాలు ముందుకు తెస్తున్నాయి. మతాలు, జాతులవారీ విభజన, బహుళత్వం పట్ల వ్యతిరేకత, విదేశీయుల పట్ల ద్వేషపూరిత ప్రసంగాలను వినీవినీ ఓటర్లు విసుగెత్తారేమో! ప్రతిపక్షాలు, ప్రగతిశీలురపై కక్షసాధింపు చర్యలు, రాజకీయ ప్రేరేపిత కేసులు, ప్రజాస్వామిక సంస్థలను, రాజ్యాంగాన్ని నీరుగార్చడం, వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేయడం వంటి నిరంకుశ ఏక పార్టీ పాలనకు చరమగీతం పాడుతున్నారు. కెనడా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, ఇంగ్లాండ్, పోలండ్, తాజాగా హంగేరీలో... పచ్చి మితవాదులను ఇంటికి పంపించారు. హంగేరి ఫలితాలు ప్రజా వ్యతిరేకులను భయపెట్టేవే!

# మార్పు దిశగా ప్రజా పాలన..

గత సాధారణ ఎన్నికల్లో తెలంగాణ ఓటేసిన రోజు.. అది కేవలం ఒక ప్రభుత్వ మార్పు కోసం వేసిన ముద్ర కాదు.. అది ఒక జనారణ్యం వినిపించిన నిశ్శబ్ద గర్జన! గత పదేళ్లలో అభివృద్ధిని చూశారు, సంక్షేమాన్ని పొందారు.. కానీ ఎక్కడో ఒక వెలితి. వినే ప్రభుత్వం కావాలి, కనిపించే నాయకుడు కావాలి అనే ఆశ ఆ రోజు ఓటుగా మారింది. అది రాజకీయ ప్రశ్న కాదు అది ప్రజల మనసులో మోగుతున్న ప్రశ్న.. ప్రజలకు వినే ప్రభుత్వం కావాలి.. స్పందించే నాయకుడు కావాలి.. గౌరవం ఇచ్చే పాలన కావాలి. ఆ ఆశలన్నింటి బరువు ఇప్పుడు ఒక వ్యక్తి భుజాలపై ఉంది ఆయనే అనుముల రేవంత్ రెడ్డి.

### ప్రజల గుమ్మం దాటిన ప్రభుత్వం..

ఒకప్పుడు ప్రజలు ప్రభుత్వాన్ని వెతికేవారు.. కానీ ఇప్పుడు ప్రభుత్వం ప్రజల దగ్గరకు వస్తోంది. ప్రజా పాలన కార్యక్రమం కేవలం ఒక పథకం కాదు.. ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం తిరిగి తెచ్చే ప్రయత్నం. అధికారులు గ్రామాల్లో నిలబడి ఫిర్యాదులు విన్నప్పుడు అది ఫార్మాలిటీ కాదు.. మీరు మా దగ్గరికి రావాల్సిన అవసరం లేదు.. మేమే వస్తాం అన్న ఒక సంకేతం.. ఇది పరిపాలనలో మార్పు కాదు.. మనసుల్లో మార్పు. తెలంగాణలో మార్పు దిశ స్పష్టంగా ఉంది. కానీ ఆ మార్పు స్థిరమైన అభివృద్ధిగా మారాలంటే సంక్షేమం, ఆదాయం, అమలు ఈ మూడు మధ్య సమతుల్యత తప్పనిసరి.. ఇక మహిళ చేతిలో డబ్బు పెట్టి కుటుంబంలో గౌరవం పెంచాలనుకున్న కార్యక్రమం మహాలక్ష్మి స్కీమ్, ఇది ఒక పథకం కాదు.. ఇది ఒక మౌన విప్లవం. ఒక గృహిణి చేతిలో డబ్బు పడినప్పుడు ఆమె కేవలం ఖర్చు చేయదు.. ఆమె కుటుంబాన్ని నిలబెడుతుంది. ఆమె మాట విలువ పెరుగుతుంది. ఆమె నిర్ణయాధికారం పెరుగుతుంది. ఆమె జీవితం మారుతుంది, కానీ ఈ శక్తివంతమైన సంక్షేమాన్ని నెరవేర్చేందుకు రాష్ట్రం ఆర్థికంగా నిలబడగలదా?

### క్లీన్ గవర్నెన్స్..

ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి ముఖ్యంగా ఫోకస్ చేసిన అంశం పారదర్శకత. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు అర్థ మయ్యేలా, అవినీతికి అవకాశాలు తగ్గేలా తీసుకున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. టెండర్ విధానాల్లో పారదర్శకత, అధికారులపై బాధ్యతను పెంచడం, ప్రజా ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన, ఇవి ఆయన పాలనకు 'క్లీన్ గవర్నెన్స్' అనే ముద్రను తెచ్చాయి.. గత ప్రభుత్వంలో ఉన్న పథకాల్ని పూర్తిగా రద్దు చేయకుండా, వాటిని మెరుగుపరచడం ఆయన ముఖ్య లక్షణం. పేదల సంక్షేమంపై ఫోకస్, మహిళలకు ఆర్థిక సహాయం, రైతులకు నేరుగా మద్దతు, ఇది 'పథకాల కొనసాగింపుతో పాటు మెరుగుదల' అనే సమతుల్యతను చూపించింది.




### సమాజ భవిష్యత్తు కోసం..

ఇక సమాజంలో తగ్గుతున్న విలువలను కాపాడేందుకు తల్లిదండ్రుల గౌరవ చట్టం ఒక గొప్ప నిర్ణయం. ఈ చట్టం వెనుక ఒక నిశ్శబ్ద బాధ ఉంది. ఒక వృద్ధుడి ఒంటరితనం ఉంది. ఒక తల్లి ఎదురుచూపు ఉంది. మనం ఎంత అభివృద్ధి సాధించినా.. మన తల్లిదండ్రులు ఒంటరిగా ఉంటే అది నిజంగా అభివృద్ధేనా? ఈ నిర్ణయం రాజకీయంగా చిన్నదిగా కనిపించవచ్చు.. కానీ సామాజికంగా ఇది ఒక గొప్ప సందేశం. అలాగే తెలంగాణలో నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు ఉద్యోగ నియామకాలు వేగవంతం చేయడం, పరీక్షల్లో పార దర్శకత వంటి చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు మద్దతుగా సరైన ధరలు, సబ్సిడీలు, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెడు తున్నారు. అలాగే హైదరాబాద్ అభివృద్ధికి ఇన్ఫ్రాస్ట్రక్చర్ మెరుగుదల, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణపై కృషి చేస్తూ, ఆరోగ్య, విద్య రంగాల్లో నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది 'సమాజపు భవిష్యత్తు' మీద పెట్టుబడిగా చూడవచ్చు.

### ఇంకా చేయాల్సింది ఉంది!

ముఖ్యమంత్రిగా బాధ్యతాయుత నిర్ణయాలు రేవంత్ రెడ్డి రాజకీయ పరిణతి సూచనగా చెప్పొచ్చు.. రేవంత్ రెడ్డి పాలన, ఆశను కలిగిస్తోంది. మార్పు సూచిస్తోంది. అయితే తెలంగాణ ఆర్థిక నిర్మాణంలో ఒక స్పష్టమైన అసమతుల్యత ఉంది. రాష్ట్ర అప్పులు ?6 లక్షల కోట్లు దాటింది. బడ్జెట్‌లో 35 -40% సంక్షేమానికి.. వడ్డీ చెల్లింపులకు 12-15% ఖర్చు చేస్తోంది. కాబట్టి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలతో పాటు ఆర్థిక స్థిరత్వం కాపాడాలి.. ఇదే పాలనలో అసలు పరీక్ష. తెలంగాణలో మార్పు మొదలైంది.. కానీ ఆ మార్పు నిలబడాలంటే ఇంకా చాలా చేయాల్సి ఉంది. కానీ ప్రారంభం సరైన దిశలో ఉందా? అవును, ఉందని చెప్పడానికి ప్రస్తుతం ఉన్న చర్యలు సరిపోతున్నాయి.

# ప్రభుత్వ నిర్లక్ష్యం.. విద్యార్థులపై భారం!

ఇటీవల రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాలుగా చెల్లించకపో వడంతో విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.. ఫలితంగా ప్రైవేటు కళాశాలలు నేరుగా విద్యార్థుల నుంచే ట్యూషన్ ఫీజులు వసూలు చేయడం ప్రారంభించాయి. ఫీజు చెల్లించలేని విద్యార్థుల నుండి బాండ్ అఫిడవిట్లు తీసుకుని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధించే పరిస్థితులు ఏర్పడ్డాయి.

### ప్రైవేట్ సంస్థలు కోర్టును ఆశ్రయించడంతో..

ఈ బకాయిలు సరిగ్గా విడుదల చేయకపోవడంతో ప్రభుత్వ కళాశాలలు సైతం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. చిన్న ప్రైవేటు విద్యాసంస్థలు వడ్డీలకు అప్పులు తెచ్చుకొని నిర్వహణ సాగిస్తున్నాయి. ఇదే సమయంలో, ప్రభుత్వ జీవోల ప్రకారం విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయరాదనే నిబంధనల కారణంగా ప్రైవేటు కళాశాలలు తమ కార్యకలాపాలను కొనసాగించలేకపోతున్నామని ఇటీవలే కోర్టును ఆశ్రయించి విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకునే అనుమతిని ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశాయి. అయితే ప్రభుత్వం తరపున కౌంటర్ అఫిడవిట్ సమర్పణలో జాప్యం జరగడం, పలుమార్లు అవకాశం ఇచ్చినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో, కోర్టు పిటిషనర్ల అభ్యర్థనను మధ్యంతర చర్యగా ఆమోదించింది. ఈ ఆదేశాలు 2026-27 విద్యా సంవ త్సరానికి వర్తించనున్నాయి. ఈ నెల 30లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చింది.

### లాభాపేక్ష ఉండకూడదనే సూత్రాన్ని విస్మరించి..

అయితే ఈ జాప్యం ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు కలిగిస్తోంది. ప్రస్తుతం పరిస్థితి చూస్తే, ఒకవైపు ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరేందుకు ప్రోత్సహిస్తూనే, మరోవైపు తగిన ఆర్థిక మద్దతు అందించడంలో విఫలమవుతోంది. గ్లోబలైజేషన్, మార్కెటీకరణ ప్రభావంతో విద్య, వైద్యం వంటి సేవా రంగాల నుండి ప్రభుత్వం క్రమంగా వైదొలుగుతోంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు తగిన మౌలిక సదుపాయాలు, సిబ్బంది లేకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. అదే సమయంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు భారీ ఫీజులు వసూలు చేస్తూ, విద్యను పేదలకు అందకుండా చేస్తున్నాయి. విద్యారంగం లాభాపేక్షకు లోబడి ఉండకూడదనే సూత్రాన్ని 'మోడ్రన్ డెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఒ ఇతరులు వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర -2009' కేసు స్పష్టం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిదారులు విద్యను వ్యాపారంగా మార్చేశారు.. ఇటీవల హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు కూడా ఈ ధోరణికి చట్టబద్ధత కల్పిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.




### కోర్టు జోక్యం చేసుకోవాలి!

గతంలో విద్యార్థి సంఘాలు, కళాశాల యాజమాన్యాలు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కొంత మేర నిధులు విడుదల చేసింది. అయితే అవి మొత్తం బకాయిలతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయి. అందుకే ప్రభుత్వం ప్రతీ విద్యా సంవత్సరం పూర్తయ్యేలోపు మొత్తం ఫీజులను విడుదల చేసే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచిత ఉన్నత విద్యను అందిస్తే ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. దీనిని అన్ని ప్రభుత్వాలు అమలు చేసేలా చట్టబద్ధత కల్పించాలి. అలాగే కోర్టు సైతం మాండమస్ రిట్ (ప్రభుత్వ సంస్థలు తమ బాధ్యతలను నిర్వర్తించేందుకు కోర్టు ఇచ్చే ఆదేశం) జారీ చేసి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, సామర్థ్యం లేని పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది.

# పెయింటింగ్ చీరలో కాయాదు స్టన్నింగ్ లుక్స్







అస్సాం నుంచి వచ్చి సౌత్ ఇండియాను తన నటనతో పలుకరిస్తున్న యంగ్ బ్యూటీ కాయాదు లోహర్, తాజాగా షేర్ చేసిన ఫోటోలతో నెట్టింట మంటలు పుట్టిస్తోంది. షీర్ ఆర్గాంజా చీరలో, చేతితో గీసిన బొటానికల్ ప్రింట్స్ మెరుస్తుంటే, ఒక అందమైన పెయింటింగ్ లా కనిపిస్తున్న కాయాదును చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఒకవైపు గ్లామర్ ఒలికిస్తూనే, మరోవైపు నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న కాయదు లేటెస్ట్ లుక్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం..

అస్సాం నుంచి వెండితెరకు.. కాయాదు జర్నీ: తేజ్‌పూర్ కు చెందిన కాయాదు లోహర్, తన అందం మరియు అభినయంతో చాలా తక్కువ సమయంలోనే మల్టీ లాంగ్వేజ్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకుంది. 2021లో 'ముగిల్ పేట' అనే కన్నడ సినిమాతో కెరీర్ ప్రారంభించిన ఈమె, ఆ తర్వాత మలయాళ, మరాఠీ చిత్రాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా 2025లో విడుదలైన 'డ్రాగన్' అనే తమిళ సినిమా ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమా తెచ్చిన గుర్తింపుతో ఇప్పుడు సౌత్ ఇండియన్ సినిమా అంతా కాయదు వైపు చూస్తోంది.

హ్యాండ్ పెయింటెడ్ చీరలో అదిరిపోయే అందం: తాజాగా సోషల్ మీడియాలో కాయాదు పోస్ట్ చేసిన ఫోటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. రంగు రంగులతో కూడిన హ్యాండ్ పెయింటెడ్ బొటానికల్ ప్రింట్స్ ఉన్న షీర్ ఆర్గాంజా చీరలో ఆమె ఎంతో హుందాగా కనిపిస్తోంది. దీనికి కాంబినేషన్‌గా సేజ్ గ్రీన్ కలర్ బ్లౌజ్ ధరించి, మోడ్రన్ అండ్ ట్రెడిషనల్ లుక్‌ను పర్ఫెక్ట్‌గా మేనేజ్ చేసింది. మినిమల్ మేకప్ మరియు సింపుల్ హెయిర్ స్టైల్‌తో కాయాదు నిజంగా ఒక అందమైన కావ్యంలా ఉందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

తెలుగు సినిమాల్లో బిజీ - వరుస ప్రాజెక్టులు: తెలుగు ప్రేక్షకులకు 'అల్లూరి' సినిమాతో పరిచయమైన కాయాదు, ఇప్పుడు టాలీవుడ్‌లో కూడా బిజీ అవుతోంది. ఇటీవల విశ్వక్ సేన్ సరసన 'ఫంకీ' అనే కామెడీ మూవీ తో మన ముందుకు వచ్చింది. ఇక నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది పారడైజ్' లో కూడా ఒక కీలక పాత్ర పోషిస్తోంది. అంతేకాకుండా, మలయాళంలో టొవినో థామస్ సరసన 'పల్లిచట్టంబి' వంటి క్రేజీ మూవీ లో నటిస్తుంది. నటనకు ఆస్కారమున్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవడమే ఆమె సక్సెస్ సీక్రెట్ అనిపిస్తోంది. ఒకప్పుడు మోడలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్న కాయదు, ఇప్పుడు సౌత్ ఇండియాలో బిజీయెస్ట్ నటిగా మారుతోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ప్రతి సినిమాలో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటోంది. తాజాగా విడుదలైన ఫోటోలు చూస్తుంటే, ఆమె ఫ్యాషన్ సెన్స్ కూడా నెక్స్ట్ లెవల్‌లో ఉందని అర్థమవుతోంది. మరిన్ని వైవిధ్యమైన సినిమాలతో కాయదు బాక్సాఫీస్ వద్ద కూడా తన సత్తా చాటాలని ఆశిద్దాం.



# వృషకర్మ రిలీజ్ డేట్.. నాగచైతన్య అప్డేట్!

అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. 'విరూపాక్ష' డైరెక్టర్ కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య చేస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎంతవరకు వచ్చింది? ఎప్పుడు విడుదల కాబోతోంది? అనే విషయాలపై చైతన్య స్వయంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా బడ్జెట్ నుంచి విలన్ వరకు అన్నీ ఆసక్తికరంగా ఉన్న ఈ ప్రాజెక్ట్ గురించిన మరిన్ని విశేషాలు చూద్దాం..

షూటింగ్ క్లైమాక్స్‌కు - చైతన్య ఖుషి: నాగచైతన్య తన కెరీర్‌లో ముందెన్నడూ చేయని ఒక విభిన్నమైన రోల్‌లో ఈ సినిమాలో కనిపించబోతున్నారు. తాజాగా మీడియా ఇంటరాక్షన్‌లో చైతూ మాట్లాడుతూ, సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. ఇక ఇప్పటికే 85 శాతం చిత్రీకరణ పూర్తయిందని, కేవలం 15 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఆ కొద్ది భాగాన్ని కూడా చకచకా పూర్తి చేసి, ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. అవుట్‌పుట్ చూశాక చైతన్య ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉండటం విశేషం.

చైతూ కెరీర్‌లోనే భారీ బడ్జెట్: ఈ సినిమాను నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఏకంగా 120 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. నాగచైతన్య మార్కెట్ దృష్ట్యా ఇది చాలా పెద్ద రిస్క్ అయినప్పటికీ, కథ మీద ఉన్న నమ్మకంతో మేకర్స్ ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఇక ఈ ప్యాన్-ఇండియా చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ కూడా సహకారం అందిస్తుండటం సినిమాపై క్రేజ్‌ను డబుల్ చేసింది. 'వృషకర్మ'లో విజువల్స్ మరియు మిస్టరీ ఎలిమెంట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని ఇండస్ట్రీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

క్రేజీ కాస్టింగ్ - మీనాక్షి చౌదరి, స్పర్శ్ శ్రీవాస్తవ: సినిమాలో నాగచైతన్యకు జోడీగా టాలెంటెడ్ బ్యూటీ మీనాక్షి చౌదరి నటిస్తోంది. అయితే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతున్నది ఎవరంటే లాపతా లేడీస్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్పర్శ్ శ్రీవాస్తవ. ఈ సినిమాలో ఆయన విలన్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో మెరవబోతున్నారు. హీరో, విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లు ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తాయని తెలుస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం ఈ మిస్టికల్ అడ్వెంచర్‌కు ప్రాణం పోయనుంది.

### అక్కినేని ఫ్యాన్స్‌కు పండగే:

చివరగా, 'వృషకర్మ' సినిమాతో నాగచైతన్య తన బాక్సాఫీస్ సత్తా చాటుతారని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. కార్తీక్ దండు 'విరూపాక్ష'తో ఎలాగైతే థ్రిల్ చేశారో, అంతకు మించి ఈ సినిమాలో మ్యాజిక్ ఉండబోతోందని సమాచారం. ఇక షూటింగ్ పూర్తయిన వెంటనే గ్రాండ్ లెవల్‌లో ప్రమోషన్స్ ప్రారంభించి, విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. 120 కోట్ల భారీ బడ్జెట్, మిస్టికల్ కథాంశం వెరసి ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద చైతన్యకు ఒక సాలిడ్ హిట్ దక్కుతుందని ఆశిద్దాం. విజువల్ పరంగా


# గ్లామర్ లోకంలో డాక్టర్ శ్రీలీల!



తెలుగు నటి శ్రీలీల డ్యాన్సులు, నటనతోనే కాదు. చదువు పట్ల తనకున్నఅంకితభావంతోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకవైపు స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు ఎంబీబీఎస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం హీరోయిన్లలో అరుదైన విషయం. నటిగా కొనసాగుతూ డాక్టర్ర లాంటి పెద్ద చదువును పూర్తి చేయడం అంటే ఆషామాషీ కాదు. రెండు రంగాలపై ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. మరి వీటిని శ్రీలీల ఎలా బ్యాలెన్స్ చేస్తుంది? అంటే సినిమా షూటింగులు - మెడికల్ చదువులను మేనేజ్ చేయడం ఎలా సాధ్యమని అడిగితే ఆసక్తికర సమాధానం చెప్పింది. దీనికి అచంచలమైన సంకల్పం ఓపిక ఎంతో అవసరం. ఒక్కోసారి పరిస్థితులు క్లిష్టంగా మారతాయి. ఏమీ అర్థం కానట్టు అనిపిస్తుంది. అలాంటప్పుడు సహనంతో నిరణజ్ఞాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎంత ఇష్టమున్నా? ఒకేసారి రెండింటిలో కొనసాగి ఇబ్బంది పడటం అవసరమా? అనిపిస్తుంది. కానీ మనసు ప్రశాంతంగా ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే ఏదైనా సాధించొచ్చు అంటుంది. వైద్య వృత్తిపై ఉన్న ఇష్టం, ఆ సబ్జెక్టుపై ఉన్న మక్కువ తనను ముందుకు నడిపించాయంది. పని ఒత్తిడిలో కూడా మనసును ఒక విషయం నుండి మరొక విషయానికి మార్చుకోగలగడం తన విజయ రహస్యంగా తెలిపింది. శ్రీలీల మామ్ కు, తాతయ్యకు ఇచ్చిన మాట కోసం ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఎంతో శ్రమించింది. షూటింగ్ బ్రేక్స్‌లో కారవాన్‌లో కూర్చుని చదువుకునేది. సెట్స్‌లో ఉన్నప్పుడు కూడా మెడికల్ పుస్తకాలను వెంట ఉంచుకో వడం అలవాటుగా మార్చుకుంది. ముంబైలోని డి.వై. పాటిల్ యూనివర్సిటీ నుండి ఇటీవల పట్టా పొందిన సమయంలో ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారంటే? ఆ డిగ్రీ వెనుక ఎంతటి కష్టం ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా తన తల్లి స్పెషలైజేషన్ అయిన గైనకాలజీలో ఆమె మంచి మార్కులు సాధించడం విశేషం. శ్రీలీల తల్లి స్వర్ణలత వృత్తిరీత్యా గైనకాలజిస్ట్. తల్లిని చూస్తూ పెరగడం వల్లే తనకు కూడా వైద్య వృత్తిపై గౌరవం ఏర్పడిందని శ్రీలీల చెబుతుంది. స్టార్ హీరోయిన్‌గా ఎంత బిజీగా ఉన్నా? తన ప్రాథమిక బాధ్యత చదువేనని ఆమె ఎప్పుడూ నమ్ముతుంది. సినిమా సెట్స్‌లో లైట్ల వెలుతురులో గడుపుతూనే, రాత్రిపూట దీపం వెలుగులో మెడికల్ టెక్స్ట్ బుక్స్‌తో కుస్తీ పట్టడం ఆమె దైనందిన జీవితంలో భాగమైపోయింది. ఒకే సమయంలో రెండు విభిన్నమైన కష్టతరమైన రంగాల్లో రాణించడం అనేది నేటి యువతకు ఒక గొప్ప స్ఫూర్తి. నటనపై ఫ్యాషన్ ఉన్నా? విద్యను నిర్లక్ష్యం చేయకుండా రెండు లక్ష్యాలను చేరుకోవచ్చని శ్రీలీల నిరూపించింది. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని ఆమె ప్రస్థానం చూస్తే అర్థమవుతుంది. గ్లామర్ రంగంలో ఉన్నవారికి చదువు అబ్బదు అనే పాతకాలపు ఆలోచనలను శ్రీలీల పటాపంచలు చేసింది. కేవలం అందం మాత్రమే కాదు. మెదడుకు కూడా పదును పెట్టాలని నిరూపించింది. రోగులకు సేవ చేస్తూనే, మరోవైపు ప్రేక్షకులను అలరించనుంది.


# బన్నీ ఫ్యాన్స్‌కు టెస్ట్ టైమ్.. రాకా కోసం ఇంకా ఎంత వెయిట్?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ రాకా చుట్టూ తాజా బజ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొదట 2027 ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు ఆ టైమ్‌లైన్‌ను మిస్ అయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా రిలీజ్ డిసెంబర్ 2027 లేదా సంక్రాంతి 2028కు షిఫ్ట్ అయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై రిలీజ్ వాయిదా వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తితో పాటు కొంత ఆందోళనను కూడా పెంచుతున్నాయి 2027 ఏప్రిల్ వరకు రాకా షెడ్యూల్స్ ఈ ఊహాగానాలకు కారణంగా మారింది ముంబై షూటింగ్ నుంచి బయటకు వచ్చిన ఓ చిన్న క్లూ. చిత్ర యూనిట్ ఉపయోగిస్తున్న ఐడెంటిటీ ట్యాగ్‌పై ఉన్న వివరాల ప్రకారం, షూటింగ్ షెడ్యూల్ ఏప్రిల్ 2027 వరకూ కొనసాగవచ్చని సంకేతాలు కనిపించాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు లాంగ్ షెడ్యూల్స్ ఉండటం కొత్త విషయం కాదు. కానీ రాకా విషయంలో ఈ స్థాయి లాంగ్ షూటింగ్ ఎందుకు అవసరమైంది అన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ అట్లీ తన స్టైల్‌కు తగ్గట్టుగా ప్రతి సీన్‌ను గ్రాండియర్‌గా ప్లాన్ చేస్తున్నారనే టాక్ ఉంది. రాకా హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా ఇక ఈ ఆలస్యానికి మరో కీలక కారణంగా చెప్పబడుతున్నది భారీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన పలువురు టెక్నీషియన్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టిన ఈ సినిమా, పోస్ట్ ప్రొడక్షన్‌కే ఎనిమిది నెలల కంటే ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉందని ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే, రాకా కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫ్యాన్స్ మిక్స్డ్ రియాక్షన్స్ అయితే ఈ భారీ స్కేల్ ఒకవైపు హైప్‌ను పెంచుతుండగా, మరోవైపు వెయిటింగ్ టైమ్ కూడా పెరుగుతోంది. కాగా ఈ విషయంలో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ రియాక్షన్ మిక్స్‌డ్‌గా ఉంది. మంచి క్వాలిటీ కోసం ఎంతైనా వెయిట్ చేస్తామని ఓ వర్గం చెబుతుండగా, ఇంకా ఎంత కాలం వెయిట్ చేయాలంటూ మరో వర్గం ప్రశ్నిస్తోంది. అల్లు అర్జున్ ఫ్యాన్‌బేస్‌లో మాత్రం ఈ ప్రాజెక్ట్‌పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతూనే ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న రాకా గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తోందని స్పష్టమవుతోంది. అందుకే మేకర్స్ రిలీజ్ టైమింగ్ విషయంలో కూడా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి 2028 సీజన్‌ను టార్గెట్ చేస్తే, భారీ బాక్సాఫీస్ రన్ సాధించే అవకాశం ఉంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, ఇతర స్టార్ సినిమాలతో క్లాష్ ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తికర అంశంగా మారింది. మొత్తానికి, భారీ అంచనాలు, విస్తృతమైన నిర్మాణ ప్రక్రియ, హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వర్క్ అన్నీ కలిపి రాకాను ఒక లాంగ్ గెస్టేషన్ ప్రాజెక్ట్‌గా మార్చుతున్నాయి.

# త్రిష కృష్ణన్ 100 కోట్ల సామ్రాజ్యం 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో అరుదైన మైలురాయి!





దక్షిణాది సినీ పరిశ్రమలో -ఎవర్ గ్రీన్ క్వీన్-గా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ తన 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కేవలం నటిగానే కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగారు. ప్రస్తుతం త్రిష నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల రూపాయలకు చేరుకోవడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 1999లో -జోడి- చిత్రంతో సహాయ నటిగా ప్రయాణం మొదలుపెట్టిన త్రిష.. నేటికీ అగ్ర కథానాయికగా కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఒక నటిగా ఇన్ని దశాబ్దాల పాటు తన క్రేజ్‌ను కాపాడుకుంటూ ఆర్థికంగా ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం.

త్రిష ఆదాయ వనరులను పరిశీలిస్తే.. ఒక్కో సినిమాకు సుమారు 3 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. -పొన్నియిన్ సెల్వన్- వంటి భారీ విజయాల తర్వాత డిమాండ్ మరింత పెరిగింది. సినిమాలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రకటనల ద్వారా కూడా ఆమె భారీగానే ఆర్జిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. స్థిరమైన ఆదాయాన్ని గడించారు. ఈ సంపాదనను తెలివిగా వివిధ రంగాల్లో పెట్టుబడిగా మలిచారు. త్రిష ఆస్తిపాస్తుల్లో ప్రధానమైనవి హైదరాబాద్ - చెన్నైలలోని విలాసవంతమైన నివాసాలు. ముఖ్యంగా చెన్నైలోని ఆమె సొంత ఇల్లు అత్యంత ఖరీదైన ఇంటీరియర్స్‌తో సకల సౌకర్యాలతో కూడి ఉంది. దీని విలువ దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇవే కాకుండా.. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భారీగా పెట్టుబడులు ఉన్నాయి. పలు నగరాల్లో విలువైన భూములు - వాణిజ్య సముదాయాల్లో భాగస్వామ్యం ఉండటం త్రిష ఆర్థిక భవిష్యత్తుకు మరింత భరోసాగా నిలిచాయి. విలాసవంతమైన జీవనశైలికి మారుపేరైన త్రిషకు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. గ్యారేజీలో బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కేవలం భౌతిక సంపాదనే కాకుండా..జంతు సంరక్షణ .. పలు సేవా కార్యక్రమాల కోసం తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ సమాజం విషయంలో తన బాధ్యతను చాటుకుంటున్నారు. త్రిష లైఫ్ స్టైల్ నేటి తరం యువ నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఎదురైనా.. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విమర్శలు వచ్చినా కుంగిపోకుండా తన కెరీర్‌ను విజయవంతంగా మలుచుకున్న త్రిష ప్రయాణం స్ఫూర్తిదాయకం. 40 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోయిన్లకు పోటీనిస్తూ..మరోవైపు వంద కోట్ల ఆస్తిని కూడబెట్టడం చూస్తుటే.. త్రిష వృత్తి గతంగా చూపే అంకితభావానికి ప్రతిఫలం.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .